


PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 346, పేజీలు - 08
శనివారం, జూన్ 6, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## 50 శాతం కూడా ఖర్చు చేయకుండా 90 శాతం పనులెలా పూర్తి చేశారు

### - పాలమూరు ప్రాజెక్టులపై రేవంత్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల పురోగతి , గత ప్రభుత్వ వైఫల్యాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జిల్లా ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడమే లక్ష్యంగా తాము కంకణం కట్టుకున్నామని స్పష్టం చేస్తూ, ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తోన్న విమర్శలను గణాంకాలతో సహా తిప్పికొట్టారు.

**పదేళ్ల కేసీఆర్ పాలనలో నిధుల దుర్వినియోగం**

తెలంగాణ వస్తే పాలమూరు ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఆశించారని, కానీ గత పదేళ్ల కేసీఆర్ పాలనలో జిల్లాకు ఘోర అన్యాయం జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల కోసం మొత్తం రూ. 1 లక్ష 81 వేల కోట్లు ఖర్చు పెడితే, అందులో అక్షరాలా లక్ష కోట్లు కేవలం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు కోసమే తగలేశారని మండిపడ్డారు. అత్యంత కీలకమైన, జిల్లాకు జీవనాడి లాంటి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.



**కమీషన్ల కోసమే పంపులు, లిఫ్టులు.. భూసేకరణ సున్నా**

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా 90 టీఎంసీల నీటిని అందించే అవకాశం ఉందని, జూరాల,

2లో..

## బీజేపీకి అన్నామలై గుడ్‌బై

### - రాజీనామా ఆమోదించిన పార్టీ అధిష్ఠానం



చెన్నై (ప్రశ్న న్యూస్) తమిళనాడులో రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీకి గట్టి షాక్ తగిలింది. ముఖ్యంగా ఈ పార్టీలో అత్యంత గుర్తింపు పొందిన కె. అన్నామలై ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. గత కొన్ని రోజులుగా ఆయన పార్టీ మారుతున్నారంటూ సాగుతున్న సస్పెన్స్‌కు తెరదించుతూ ఆయన రాజీనామా చేయగా బీజేపీ అధిష్ఠానం కూడా వెంటనే స్పందించి అన్నామలై రాజీనామాను ఆమోదించింది. ఈ మేరకు బీజేపీ అధికారిక ప్రకటన విడుదల చేస్తూ "తమిళనాడు మాజీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ కె. అన్నామలై సమర్పించిన రాజీనామాను, భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఆమోదించారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఆయన చేసిన రాజీనామా తక్షణమే అమలులోకి వస్తుంది" అని పేర్కొంది.

**ఢిల్లీ వేదికగా సాగిన చివరి ప్రయత్నాలు..**

41 ఏళ్ల ఈ యువనేత మంగళవారం నాడే అత్యవసరంగా ఢిల్లీకి చేరుకుని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌ను కలిశారు. సత్సంబంధాలతోనే, ఎలాంటి చేదు అనుభవాలు లేకుండానే పార్టీతో తన బంధాన్ని ముగించాలనుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఆ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అలాగే అన్నామలైలోని రాజకీయ నాయకత్వ ప్రతిభను మొదటగా గుర్తించిన కీలక నేత బి.ఎల్. సంతోష్‌లతో కూడా ఆయన వరుసగా

2లో..

## సింగరేణి స్కామ్‌లపై విచారణ జరపకపోతే జంగ్ సైరన్ మోగిస్తాం

### - కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేఖ రాశారు. సింగరేణిలో రూ. 1,600 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపిస్తున్న కేటీఆర్ దానిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సింగరేణిలో వరుస స్కామ్‌లు చోటుచేసుకుంటున్నామని ఆరోపించారు. ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు మాయమైందని ఆరోపించారు. ఏప్రిల్ నెలఖారు నాటికి మందమర్రిలో 7,20,000 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్‌లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం 1లో ఆరు లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం 2లో నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేల మెట్రిక్ టన్నులు, ఇల్లందులో 3 లక్షల 50 వేల మెట్రిక్ టన్నులు, సత్తుపల్లిలో రెండు లక్షల మెట్రిక్ టన్నులతో పాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారని కానీ కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద

2లో..

## రూ.కోట్ల విలువైన భూముల్లో ఇందిరమ్మ ఇళ్లు

### - ఆడబిడ్డలే లబ్ధిదారులుగా పట్టాలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం రోజున సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి క్యూర్ పరిధిలో

2లో..

## విశాఖ రోడ్లపై సీఎం సైకిల్ సవారీ

### - సైక్లింగ్ అనేది జీవన విధానం కావాలన్న చంద్రబాబు

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ తొక్కిన సీఎం చంద్రబాబు
- విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సాగిన ర్యాలీ
- 5.5 కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లో పూర్తి చేసిన ముఖ్యమంత్రి
- సీఎంతో పాటు పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు




విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) 'పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను తీర్చిదిద్దాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ సీఎం చంద్రబాబు నాయుడు మట్నక్కను నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందన్న సీఎం తెలిపారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే

2లో..

## కైలాసగిరి నుంచి భోగాపురం వరకు బే సిటీ

### - విశాఖ రూపురేఖలు మార్చేలా ఏపీ ప్రభుత్వం చర్యలు

### - కార్యాచరణ సిద్ధం చేయాలన్న చంద్రబాబు



విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) ఏపీ ఆర్థిక రాజధాని విశాఖ రూపురేఖలు త్వరలోనే మారిపోనున్నాయి. ముంబయి తరహాలో వైజాగ్‌ను అభివృద్ధి చేసేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా చేసిన ఆలోచనే బేసిటీ. విశాఖపట్నంలోని కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బే సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖపట్నంలో పర్యటించిన చంద్రబాబు విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై 9 జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బేసిటీగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే గ్రేహౌండ్స్‌కు చెందిన 303 ఎకరాల్లో కన్వెన్షన్ సెంటర్ నిర్మించాలని చంద్రబాబు ఆదేశించారు.

2లో..

## "కేసీఆర్"కు సీఎం రేవంత్ సవాల్

- రాసిపెట్టుకో.. పాలమూరు జిల్లాలో నీ జెండాను ఎగరనివ్వను
- "పాలమూరు నుంచి పారిపోయిన వ్యక్తి ద్రోహి ఎవరు?"
- అది కాళేశ్వరం కాదు.. కూలేశ్వరం
- ప్రాజెక్టులపై బీఆర్ఎస్ పూర్తి వైఫల్యమైందని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పాలమూరు జిల్లా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన, మాజీ సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ పార్టీనే కట్టిందని గత 10 ఏళ్లలో ఏ ప్రాజెక్టును కట్టారని ప్రశ్నించారు. ఇక బీఆర్ఎస్ నేతలు పాదయాత్రలు చేస్తామని అంటున్నారని అయితే పాదయాత్రలు కాదు పాలమూరు నుంచి కాశీకి పొర్లుదండాలు చేసినా వారి పాపాలు తీరవు అని మండిపడ్డారు. పాలమూరు జిల్లాకు బీఆర్ఎస్ చేసిన అన్యాయాన్ని ఇక్కడి ప్రజలు మర్చిపోరని ఈ జిల్లాలో బీఆర్ఎస్ జెండా ఉండదని, ఎమ్మెల్యే గెలవరు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను గురు, శుక్రవారాల్లో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి జడ్చర్ల మండలం గంగాపూర్ బహిరంగ సభలో ప్రసంగించారు.

2లో..

## 198 ఎకరాల భూమి.. విలువ రూ.30 వేల కోట్లు

### - చారిత్రక రాతి నిర్మాణాలను కాపాడేందుకు హైడ్రా చర్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం.

2లో..

## భారత ఏఐ ఆశలకు బిగ్ బూస్ట్

### - ఆస్ట్రేలియన్ కంపెనీ రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్‌ను అంతర్జాతీయ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ హబ్‌గా మార్చే దిశగా చరిత్రాత్మక ముందడుగు పడింది. ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ డేటా సెంటర్ల సంస్థ 'ఎయిర్‌ట్రంక్' రాబోయే నాలుగేళ్లలో మనదేశంలో ఏకంగా 30 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 2.50 లక్షల కోట్లు) భారీ పెట్టుబడులు

2లో..

## ప్రభుత్వ ఉద్యోగాల్లో అధిక విద్యార్హతలుంటే అర్హులు కారు

### - సుప్రీంకోర్టు సంచలన తీర్పు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం ఓ సంచలన తీర్పును ఇచ్చింది. ఏదైనా ఒక ఉద్యోగ నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు అందులో పేర్కొన్న నిర్దేశిత విద్యార్హతలు ఉన్న అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. అంతకంటే ఎక్కువ చదువుకున్న అభ్యర్థులను ఆయా పోస్టులకు ఎంపిక చేయకూడదని న్యాయస్థానం

2లో..

## లాసెట్‌లో మెరిసిన మాజీ మావోయిస్ట్ నేత దేవ్‌జీ

- 5 ఏళ్ల లా కోర్సులో 349వ ర్యాంకు సాధించిన దేవ్‌జీ
- పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని వెల్లడి
- 50 ఏళ్లు పైబడిన వయసులోనూ పట్టుదలతో చదివి అర్హత సాధించిన వైనం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఒకప్పుడు దండకారణ్యంలో తుపాకీ పట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన చేతులు ఇప్పుడు న్యాయశాస్త్ర పుస్తకాలు పట్టనున్నాయి. మావోయిస్టు మాజీ అగ్రనేత తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, తన కొత్త జీవిత ప్రయాణంలో కీలక అడుగు వేశారు. తెలంగాణలో నిర్వహించిన లాసెట్ (లా కామన్ ఎంట్రన్స్ టెస్ట్) ప్రవేశ పరీక్షలో ఆయన అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఐదేళ్ల న్యాయ విద్య కోర్సు కోసం

2లో..

# 50 శాతం కూడా ఖర్చు చేయకుండా
## 90 శాతం పనులెలా పూర్తి చేశారు

భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, కల్వకుర్తి వంటి ప్రాజెక్టులతో పాటు దీనిని పూర్తి చేసి ఉంటే జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లలో కేసీఆర్ ఈ ప్రాజెక్టుపై రూ. 27 వేల కోట్లు ఖర్చు పెట్టినప్పటికీ, ఆ ధనమంతా కేవలం పంపులు, లిఫ్టుల కాంట్రాక్టుల బిల్లుల రూపంలో కమీషన్లు కొల్లగొట్టడానికే సరిపోయిందని ఆరోపించారు. ఏ ప్రాజెక్టుకైనా ముందస్తుగా కావాల్సిన భూసేకరణను అసలు పూర్తి చేయకుండానే ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయని కేసీఆర్ భావించారని ప్రశ్నించారు. ఒక్క ఎకరాకు కూడా నీరివ్వకుండా ఎక్కడి దక్కడే వదిలేసివెళ్లారని, దీనిపై నాగం జనార్ధన్ రెడ్డి ఎన్నో ఏళ్లుగా పోరాటం చేశారని గుర్తుచేశారు.

### అప్పుల భారం - 30 నెలల్లో కాంగ్రెస్ సాధించింది ఇదే

గత పదేళ్లలో కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టుల పేరుతో రూ. 84,503 కోట్ల భారీ అప్పును మిగిల్చారని సీఎం వెల్లడించారు. తాము అధికారంలోకి వచ్చిన ఈ 30 నెలల కాలంలోనే ఆ అప్పుల కింద రూ. 52,120 కోట్లు కట్టాల్సి వచ్చిందని తెలిపారు. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైనప్పటికీ, ఎంతో ఓపికతో తాము 30 నెలల్లో కాంట్రాక్టర్లకు రూ. 22 వేల కోట్లు చెల్లించామని, అందులో రూ. 8 వేల కోట్లు కేవలం పాలమూరు ప్రాజెక్టుల కోసమే ఖర్చు పెట్టామని గణాంకాలను సభ ముందుంచారు. పాలమూరు కోసం తాము ఎంతగా కట్టుబడి ఉన్నామో చెప్పడానికి ఈ నిధులే నిదర్శనమన్నారు.

### బీఆర్ఎస్ 90 శాతం అబద్ధాలు - ఆ సైన్స్ నాకు అర్థం కాదు

పాలమూరు ప్రాజెక్టులు 90 శాతం పూర్తయ్యాయంటూ బీఆర్ఎస్ నేతలు పచ్చి అబద్ధాలు చెపుతున్నారని రేవంత్ రెడ్డి దుయ్యబట్టారు. ప్రాజెక్టు అంచనా వ్యయంలో 50 శాతం కూడా ఖర్చు చేయకుండా 90 శాతం పనులు ఎలా పూర్తవుతాయో ఆ సైన్స్, మ్యాథ్స్ తనకు అర్థం కావడం లేదంటూ ఎద్దేవా చేశారు. నేనేం కేసీఆర్ లాగా 80 వేల పుస్తకాలు చదవలేదు అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఉన్నదంతా దోచుకుపోయి, ఇప్పుడు తాము ప్రాజెక్టులను ఒక కొలిక్కి తెస్తుంటే, ప్రజల్లో తమను దోషులుగా చూపేందుకు బీఆర్ఎస్ రాజకీయ డ్రామాలు ఆడుతోందని, కానీ ప్రజలు అమాయకులు కారని, వారికి అంతా తెలుసని అన్నారు.

### రెండేళ్లలో పూర్తి చేస్తాం - సహకరించండి

ప్రజలు ఛీదరించుకుంటున్నా సోయి లేకుండా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నేతలు, తిన్నది అరిగేలా పాదయాత్రలు చేసే బదులు కాశీ వరకు నడిస్తే వారి పాపాలు కొన్నికైనా పోతాయని హితవు పలికారు. ఇప్పటికీ ప్రాజెక్టుల కోసం ఇంకా 4 వేల ఎకరాల భూసేకరణ జరగాల్సి ఉందని, రాబోయే రెండేళ్లలో జిల్లాలోని ఈ పనులన్నింటినీ పూర్తి చేయాలని తాము కంకణం కట్టుకున్నామని సీఎం స్పష్టం చేశారు. ఈ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికే తాను స్వయంగా జిల్లాలో పర్యటిస్తున్నానని, భూసేకరణకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పటికీ ఈ పనులు పూర్తి కావని, అలా వదిలేస్తే చరిత్ర మనల్ని క్షమించదని రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. చివరగా, జిల్లా బీఆర్ఎస్ నేతలు మాకు ఎలాంటి సాయం చేయనక్కర్లేదు ఈ రాబోయే రెండేళ్లు నోరు మూసుకుని ఏమీ మాట్లాడకుండా ఉండటమే వాళ్ళు మాకు చేసే అతిపెద్ద సాయం అని రేవంత్ విజ్ఞప్తిచేశారు.

# బీజేపీకి అన్నామలై గుడ్‌బై

సమావేశం అయ్యారు. అయితే అన్నామలైని తొందరపడవద్దని, కొద్దిరోజులు వేచి చూడాలని పార్టీ పెద్దలు కోరినట్లు తెలుస్తోంది. దీని కోసం తెరవెనుక ముమ్మర రాయబారాలు సాగాయి. ఇందులో భాగంగా గురువారం నాడు తమిళనాడు ప్రస్తుత బీజేపీ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్‌ను కూడా అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించింది. మరో రౌండ్ సుదీర్ఘ చర్చలు జరిపినప్పటికీ.. అన్నామలై తన నిర్ణయాన్ని మార్చుకోకపోవడంతో ఎట్టకేలకు శుక్రవారం నాడు ఆయన రాజీనామాను ఆమోదించక తప్పలేదు.

### సొంత పార్టీ వైపు అడుగులు?

బీజేపీని వీడిన అన్నామలై కొత్తగా ఓ ప్రజా ఉద్యమాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆయన సన్నిహిత వర్గాలు అందించిన సమాచారం ప్రకారం అన్నామలై తమిళనాడు వ్యాప్తంగా ఒక భారీ ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలోని యువతను గుర్తించి, వారికి సరైన నాయకత్వ శిక్షణ ఇచ్చి, సరికొత్త రాజకీయ శక్తులుగా తీర్చిదిద్దడమే ఈ ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలుస్తోంది. రాబోయే రోజుల్లో ఈ ప్రజా ఉద్యమమే పూర్తి స్థాయి రాజకీయ పార్టీగా రూపాంతరం చెందే అవకాశం ఉందని ఆయన అనుచరులు చెబుతున్నారు. ప్రస్తుతం అన్నామలై "వి ది లీడర్స్" అనే లాభాపేక్ష లేని నాయకత్వ స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. ఈ సంస్థ అందించిన పునాదితోనే ఆయన తన సరికొత్త, సుదీర్ఘ రాజకీయ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని యోచిస్తున్నారు.

# సింగరేణి స్కామ్‌లపై విచారణ జరపకపోతే జంగ్ సైరన్ మోగిస్తాం

ఆధారమని కిషన్ రెడ్డికి రాసిన లేఖలో కేటీఆర్ చెప్పుకొచ్చారు."ఏప్రిల్ నెలలోనే బొగ్గు గనులపై నిలువలను తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ అధికారుల బృందాలు రాకపోవడం చివరకు కాగ్ అధికారులు కూడా ఇప్పటిదాకా తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుంది. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షల టన్నులు తెలంగాణ బొగ్గును పక్కదారి పట్టించాయా? అనే బలమైన అనుమానం కార్మిక లోకాన్ని వెంటాడుతోంది" అని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిలపక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని డిమాండ్ చేశారు."బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన నైని బొగ్గు గని టెండర్ల స్కామ్ కూడా దేశవ్యాప్తంగా దుమారం రేపింది. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకలాంటి సింగరేణిని కబళించేందుకు సీఎం రేవంత్ హయంలో సైట్ విజిట్ అనే నిబంధన పెట్టి, కోరుకున్నవారికి టెండర్లు కట్టబెట్టే కుతంత్రాన్ని అమలు చేశారు. ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగున్న ఇప్పటిదాకా కేంద్ర చర్యలు తీసుకున్న పాపాన పోలేదు" అని కేటీఆర్ ఆరోపణలు చేశారు. నైని బొగ్గు గనుల టెండర్ల ప్రక్రియను రద్దు చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారనే గానీ... అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. ఈ టెండర్ల అక్రమాలు తేల్చేందుకు కేంద్రం వేసిన కమిటీ ఇప్పటివరకు ఏం తేల్చిందనేది కూడా తెలియకుండా పోయిందని అన్నారు.అదే సమయంలో బొగ్గు ఉత్పత్తి కోసం కోల్ ఇండియా పాటించే విధానాలు ఏమిటి?, కాంగ్రెస్ హయంలో సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను ఎవరి ప్రయోజనాలు ఆశించి పెట్టారు?, చివరకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు ఎలా పక్కదారి పట్టించారు? అని కేటీఆర్ ప్రశ్నించారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమ దందాలను వెలుగులోకి తెచ్చేందుకు చివరకు ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా వివరాలు బయటకు పొక్కకుండా దుష్టశక్తులు అడ్డుకుంటున్న పరిస్థితి నెలకొందని అన్నారు. కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డిల మధ్య మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల పొట్టకొట్టి సంస్థను దెబ్బతీసే కాంగ్రెస్, బీజేపీ కుట్రను బీఆర్ఎస్ ఎప్పటికీ సహించదని న్నారు. సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలపై విచారణ జరపకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని అన్నారు.

# రూ.కోట్ల విలువైన భూముల్లో ఇందిరమ్మ ఇళ్లు

లక్ష ఇళ్లకు, ఇతర ప్రాంతాలల్లో 2.50 లక్షలు కలిపి మొత్తం 3.50 లక్షల ఇళ్లకుకు ఇప్పటికే ప్రరిపాలన పరమైన అనుమతులు ఇచ్చామని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా తెలిపారు. దీనిని దృష్టిలోపెట్టుకొని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకొని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ (ఎల్ఐజీ) మధ్యతరగతి వర్గాలు (ఎంఐజీ)కు లక్ష ఇళ్లు నిర్మించ బోతున్నామని తెలిపారు. పేదల జీవనోపాధికి ఏ మాత్రం ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోట్ల రూపాయల విలువచేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇళ్లు నిర్మించి ఆ స్థలములో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు.గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్ నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు.

ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో, వారికి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారని అన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉపాధి దూరమవడంతో పాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదన్నారు. ఫలితంగా ఆ గృహాలు ఖాళీగా, నిరుపయోగంగా మిగిలిపోయాయని పేర్కొన్నారు.ఇలాంటి తప్పిదాలను పునరావృతం చేయకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందని అన్నారు. పేదల అవసరాలను దృష్టిలో పెట్టుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా ఇళ్ల డిజైన్ లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు.

# విశాఖ రోడ్లపై సీఎం సైకిల్ సవారీ

ఎన్నికల్లో టిక్కెట్లంటూ సీఎం సరదా వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవోటెల్ వరకు సైకిల్‌పై ప్రయాణించి అదరహో అనిపించారు.

### ఏయూ క్యాంపస్ బయో డైవర్సిటీ పార్కుగా రూపాంతరం చెందాలి

'ఎంతో విశిష్టమైన ప్రముఖులను ఏయూ తయారు చేసింది. ఎండలు విపరీతంగా పెరిగాయి. పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోంది. ఓవైపు విపరీతమైన ఎండలు లేకుంటే తుఫానులు వస్తున్నాయి. సోలార్ ఎనర్జీ ఉత్పత్తి చేసుకోవాలి, ఏయూకు 450 ఎకరాల ల్యాండ్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెట్టాలి, బిల్డింగులపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్ సోలార్ ద్వారానే వచ్చేలా చూడాలి'అని పిలుపునిచ్చారు.'తిరుమలలో 89.5 శాతం గ్రీనరీ ఉంది. ఏయూ క్యాంపస్ బయో డైవర్శిటీ పార్కుగా రూపాంతరం చెందాలి. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ చేపట్టాలి. వేస్ట్ నుంచి బయో గ్యాస్ ఉత్పత్తి చేసేలా చూడాలి. స్వచ్ఛ పథం కింద రీ-సైక్లింగ్‌కు పంపాలి. వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లను వినియోగించుకోవాలి. వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

### 'పీఎన్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ ను వంటలకు వినియోగించుకోవాలి

'పీఎన్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ ను వంటలకు వినియోగించుకోవాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. విద్యార్థులకు ఏయూ క్యాంపస్ ఓ నాలెడ్జ్ హబ్ గా తయారు కావాలి'అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

'నెట్ జీరో విధానం అమలు విషయంలో అన్ని విద్యా సంస్థలను గైడ్ చేసేలా ఏయూ అభివృద్ధి చేయాలి. యూనివర్శిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారు చేస్తున్నాం. యూనివర్శిటీ అభివృద్ధికి విద్యార్థులు భాగస్వాములుగా ఉండాలి'అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

### 5 కోట్ల సీడ్ బాల్స్‌తో గ్రీనరీ పెంచేలా చర్యలు

'పర్యావరణ దినోత్సవం ప్రజలకు అవగాహన పెంచేందుకు నేను సైకిల్ మీదే ప్రయాణిస్తాను. సైకిలింగ్ అనేది జీవన విధానం కావాలి'అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

'విశాఖలో ప్రత్యేకంగా సైకిలింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. 5 కోట్ల సీడ్ బాల్స్‌తో గ్రీనరీ పెంచేలా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారు. విశాఖలో 50 శాతం గ్రీనరీ పెంచేలా చర్యలు చేపడతున్నాం. విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి అన్ని వ్యవస్థల్లోనూ చర్యలు తీసుకుంటాం'అని సీఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.

### సైకిల్‌పై చంద్రబాబు సవారీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖలో శుక్రవారం సైకిల్ తొక్కారు. ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవోటెల్ వరకు సైకిల్ పై ప్రయాణించారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21:18 నిమిషాల్లో సీఎం చంద్రబాబు నాయుడు చేరుకున్నారు.

త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవోటెల్‌కు సీఎం చంద్రబాబు నాయుడు చేరుకున్నారు.'ఎర్రటి ఎండ కాస్తున్నా సీఎం చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# 198 ఎకరాల భూమి.. విలువ రూ.30 వేల కోట్లు

ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది.గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది.ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# "కేసీఆర్"కు సీఎం రేవంత్ సవాల్

20 ఏళ్ల క్రితం పాలమూరు జిల్లాలో నాటిన మొక్క ఇప్పుడు తెలంగాణ సీఎంగా వృక్షమై నిలబడ్డాడని తనను ఉద్దేశించి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మిడ్జిల్ నుంచే తాను మొదట జడ్పీటీసీగా గెలిచానని అప్పటి జడ్పీటీసీనే ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పాలమూరు జిల్లా ప్రజల ముందున్నానని ఇక్కడి సమస్యలన్నింటినీ తీరుస్తానని రేవంత్ రెడ్డి మాటిచ్చారు.గతంలో కరీంనగర్‌లో ఓడిపోతాననే భయంతో కేసీఆర్ పాలమూరుకు వచ్చారని వలస వచ్చిన నేతను మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించుకున్నామని అయితే 5 ఏళ్లు ఎంపీగా ఉన్న కేసీఆర్ 5 సార్లు కూడా పాలమూరుకు రాలేదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ మేకవన్నె పులి అని తెలియక తెలంగాణ ప్రజలు రెండుసార్లు గెలిపించారని ఆరోపించారు. కేసీఆర్ కాళేశ్వరం కడితే అది కూలేశ్వరం అయిందని ఇక ఏం చేసినా బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు నమ్మరని పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.22 వేల కోట్లలో రూ.8 వేల కోట్లను పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే ఖర్చు చేసినట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇంజినీరింగ్, మెడికల్ కాలేజీలు తెచ్చుకున్నామని 200 ఎకరాల్లో ఎడ్యుకేషన్ క్యాంపస్ ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తు చేశారు. పాలమూరు వలసలు ఆగాలంటే జిల్లా సస్యశ్యామలం కావాలని పేర్కొన్నారు. డబుల్ బెడ్రూంలు కట్టిన చోటే బీఆర్ఎస్ ఓట్లడగాలని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే తాను ఓట్లు అడుగుతా అని తేల్చి చెప్పారు.కాంగ్రెస్ పార్టీ 30 నెలల పాలన గురించి చెబితే రామాయణం రాస్తే భారతం అవుతుందని పేర్కొన్న సీఎం రేవంత్ రెడ్డి 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన తన 30 నెలల కాంగ్రెస్ పరిపాలనపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. ఇరువురి పాలనపై కేసీఆర్ అసెంబ్లీకి వస్తే చర్చిద్దామని ఆ చర్చలో తాను ఓడిపోతే క్షమాపణలు చెబుతానని పేర్కొన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలన కాంగ్రెస్ పార్టీ రెండున్నరేళ్ల పాలనపై తాము చర్చకు రెడీ అని పేర్కొన్నారు. 'నీ పేరు కేసీఆర్ అయితే.. దమ్ముంటే చర్చకు రా' అని సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్?కు బహిరంగ సవాల్ చేశారు. చర్చలో ఓడిపోతే తాను ఏం చేయడానికైనా రెడీ అని ప్రకటించారు. పాలమూరు జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురనివ్వమని జెండాలు గద్దెలు దిగాలని గులాబీ దిమ్మెలు కూలాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పాలమూరు గడ్డపై ఇక బీఆర్ఎస్ గుర్తు మర్చిపోవాలని కారు గుర్తు, గులాబీ ఎమ్మెల్యే అనేది ఇక గతమేనని ఆ పార్టీ నుంచి భవిష్యత్తులో ఒక్కరినీ గెలవనివ్వమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

# లాసెట్‌లో మెరిసిన మాజీ మావోయిస్ట్ నేత దేవ్‌జీ



రాసిన ఈ పరీక్షలో 57 మార్కులు సాధించి, 349వ ర్యాంకుతో అర్హత పొందారు.ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసుల ఎదుట లొంగిపోయిన దేవ్‌జీ, జనజీవన స్రవంతిలో కలిసిన కొద్ది నెలల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. 1980-82 మధ్యకాలంలో కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్ (ఎంపీసీ) చదివిన ఆయనకు, అప్పట్లో తెలుగు సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేదు. న్యాయ విద్య చదవాలన్న సంకల్పంతో ఇటీవలే ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది మే 13న ఇంటర్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్ష రాశారు. ఆ ఫలితాలు ఇంకా వెలువడక ముందే, లాసెట్‌లో మంచి ర్యాంకు సాధించడం ఆయన పట్టుదలకు నిదర్శనం. యాభై ఏళ్లు పైబడిన వయసులోనూ చదువుపై ఆసక్తితో ఈ విజయం సాధించిన దేవ్‌జీ, భవిష్యత్తులో లాయర్‌గా మారి పేద, నిరుపేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందించడమే తన లక్ష్యమని చెబుతున్నారు.మరోవైపు గురువారం లాసెట్ ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఫలితాలు విడుదలయ్యాయి. ఏకంగా 73% మంది అభ్యర్థులు ఉత్తీర్ణులు అయ్యారు. మొత్తం 66వేల 864మంది దరఖాస్తు చేసుకుంటే.. వీరిలో 54వేల 374 మంది పరీక్షలు రాశారు. వీరిలో 39వేల 673 మంది కనీస మార్కులు సాధించి సీట్లు పొందేందుకు (కన్వీనర్ కోటా కింద) అర్హత పొందారు. లాసెట్ అభ్యర్థులు కోర్సుల్లో చేరిన తర్వాత కనీసం 75శాతం అటెండెన్స్ ఉండాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి తెలిపారు. ఇప్పటికే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. '60 ఏళ్లు దాటిన వారు మూడేళ్ల ఎల్ఎల్‌బీలో 348 మంది, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో 21 మంది, ఎల్ఎల్ఎంలో 82 మంది అర్హత సాధించారు. అంతేకాదు అర్హుల్లో 7,252 మంది బీటెక్ పూర్తి చేసినవారు ఉన్నారు' అని తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగాల్లో అధిక విద్యార్హతలుంటే అర్హులు కారు

తేల్చి చెప్పింది. తక్కువ అర్హత కలిగిన వారి కోసం కేటాయించిన ఉద్యోగాలను ఉన్నత విద్యావంతులకు కట్టబెడితే వాస్తవంగా ఆ పోస్టుకు అర్హులైన సామాన్య అభ్యర్థులకు ఘోర అన్యాయం జరుగుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది.

### మద్రాస్ హైకోర్టు ఆదేశాలు కొట్టివేత!

తమిళనాడులోని ఒక బ్యాంకులో తాత్కాలిక ప్రాతిపదికన అటెండెంట్‌గా పని చేస్తున్న ఒక ఉద్యోగిని బ్యాంక్ యాజమాన్యం విధుల్లోంచి తొలగించింది. అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సదరు ఉద్యోగి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా హైకోర్టు అతడికి అనుకూలంగా తీర్పునిస్తూ తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని బ్యాంకును ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు ఇచ్చిన పాత ఆదేశాలను పూర్తిగా పక్కన పెడుతూ ఉద్యోగిని తొలగిస్తూ బ్యాంకు తీసుకున్న నిర్ణయం సరైనదేనని సుప్రీం కోర్టు సమర్థించింది.

### నిజాలు దాచి ఉద్యోగం పొందిన యువకుడు!

ఈ కేసులో సదరు అభ్యర్థి తాను పట్టభద్రుడననే అసలు నిజాన్ని యాజమాన్యం వద్ద దాచాడని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎత్తిచూపింది. కేవలం పదో తరగతి అర్హత ఉన్న పేద అభ్యర్థులకు దక్కాల్సిన అటెండెంట్ ఉద్యోగాన్ని తప్పుడు సమాచారంతో దక్కించుకున్నాడని కోర్టు పేర్కొంది. ఈ ముఖ్యమైన వాస్తవాన్ని మద్రాస్ హైకోర్టు సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేకపోయిందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ ఉద్యోగాలు అనేవి ఎప్పుడైనా సరే ఆయా పోస్టులకు నిర్దేశించిన ఖచ్చితమైన అర్హతలు ఉన్నవారికే చెందాలని స్పష్టం చేసింది.


### తక్కువ విద్యార్హతలు పెట్టడానికి కారణమిదే

సమాజంలో ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ పరిస్థితుల కారణంగా ఉన్నత విద్యను అభ్యసించలేకపోయిన నిరుపేదలకు ఉపాధి కల్పించడమే కొన్ని ఉద్యోగాలకు తక్కువ విద్యార్హతలను నిర్ణయించడం వెనుక ఉన్న అసలు ఉద్దేశమని సుప్రీం కోర్టు వివరించింది. ఇది పూర్తిగా సహేతుకమైన, సమానత్వ ప్రాతిపదికన రూపొందించిన సామాజిక నిబంధన అని తెలిపింది. అలాగే ప్రభుత్వం అనేది ఒక ఆదర్శప్రాయమైన ఉపాధి కల్పన వ్యవస్థగా ఉండాలని కోర్టు పేర్కొంది. సామాజిక సమతుల్యత కోసం కొన్ని రకాల ప్రాథమిక ఉద్యోగాలను తక్కువ విద్యార్హతలు కలిగిన అభ్యర్థుల కోసమే ప్రత్యేకంగా కేటాయించడమే సరైన విధానమని సుప్రీం కోర్టు పునరుద్ఘాటించింది.ఒకవేళ ఇలాంటి తక్కువ స్థాయి ఉద్యోగాలకు ఉన్నత విద్యావంతులను గనుక అనుమతిస్తే వారితో తక్కువ చదువుకున్న సాధారణ అభ్యర్థులు ఎంత మాత్రం పోటీ పడలేరని, ఫలితంగా వారు ఎప్పటికీ ఉద్యోగాలు సాధించలేరని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. అందువల్లనే సమాజంలోని దిగువ వర్గాల ప్రయోజనాల దృష్ట్యా కొన్ని ఉద్యోగాలను తక్కువ అర్హతలు ఉన్నవారికి రిజర్వ్ చేయడాన్ని న్యాయస్థానాలు ఎల్లప్పుడూ సమర్థిస్తాయని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# భారత ఏఐ ఆశలకు బిగ్ బూస్ట్

పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ పరిణామంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా భారతదేశంలో ఐదు గిగావాట్ల సామర్థ్యం గల సరికొత్త డేటా సెంటర్లను నిర్మించనున్నారు. సిడ్నీ ప్రధాన కేంద్రంగా పనిచేసే ఎయిర్‌ట్రంక్ సంస్థకు అంతర్జాతీయ ఇన్వెస్టర్లు బ్లాక్‌స్టోన్, కెనడియన్ పెన్షన్ ప్లాన్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డ్ నిధులు సమకూరుస్తున్నాయి. ఈ ఏడాది ఆరంభంలో 'లుమినా క్లౌడ్‌ఇన్‌ఫ్రా' సంస్థను కొనుగోలు చేయడం ద్వారా ఎయిర్‌ట్రంక్ భారత మార్కెట్లోకి అడుగుపెట్టింది.మోదీ శుక్రవారం ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో సమావేశమయ్యారు. అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. దేశ డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలోనే ఇది భారీ పెట్టుబడి అని కొనియాడారు. ఈ ప్రాజెక్ట్ వల్ల దేశంలో లక్షలాది ఉపాధి అవకాశాలు లభిస్తాయని, స్థానిక సప్లై చైన్ వ్యవస్థ బలోపేతం అవుతుందని, క్లౌడ్ రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతుందని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఎయిర్‌ట్రంక్ సంస్థ ముంబై, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో 600 మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టులను నిర్మిస్తోంది. తాజా రూ.2.50 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ సామర్థ్యాన్ని మరింత విస్తరించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐ రేసు తీవ్రమవుతోందని, పెట్టుబడులను ఆకర్షించడంలో భారత్ చూపిస్తున్న వేగం, పారదర్శకత తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని రాబిన్ ఖుదా ప్రశంసించారు.భారత్‌లో ఇప్పటికే గూగుల్ సంస్థ విశాఖపట్నంలో తన మొదటి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్ల (2026-2030 మధ్య) పెట్టుబడులను ప్రకటించింది. అలాగే దేశీయ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, అదానీ గ్రూప్ కూడా ఏఐ, డేటా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం సుమారు 100 బిలియన్ డాలర్లకు పైగా భారీ నిధులను కేటాయించాయి. ఈ భారీ పెట్టుబడుల ప్రవాహం భారత్‌ను ప్రపంచ డిజిటల్ అడ్డాగా మార్చబోతోంది.

# కైలాసగిరి నుంచి భోగాపురం వరకు బే సిటీ



కైలాసగిరి ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. బీచ్ వాటర్ స్పోర్ట్స్, వైజాగ్ జంతు ప్రదర్శన శాలను ఆధునీకరించటంతో పాటుగా ఎర్రమట్టి దిబ్బలు, బౌద్ధక్షేత్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ చర్యల ద్వారా విశాఖకు మరింత మంది పర్యాటకులను ఆకర్షించవచ్చని సూచించారు. మరోవైపు కైలాసగిరి నుంచి భోగాపురం వరకూ బేసిటీగా డెవలప్ చేసేందుకు ముంబయిలో సక్సెస్ అయిన సిటీ అండ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ మహారాష్ట్ర లిమిటెడ్, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ తరహా విధానాలను ఏపీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

మరోవైపు విశాఖ గ్రోత్ హబ్ కింద బేసిటీని అభివృద్ధి చేయాలని నీతి ఆయోగ్ ఇటీవల సూచించింది. విశాఖపట్నం 2.0ను భోగాపురం ఎయిర్‌పోర్టు వరకు విస్తరించాలని, భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం చుట్టూ ఏరోసిటీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేయాలని కూడా నీతి ఆయోగ్ ప్రతిపాదించింది. డెవలపింగ్ విశాఖ ఎకనమిక్ రీజియన్ యాజ్ గ్లోబల్ ఎకనమిక్ హబ్ అనే పేరుతో నివేదిక విడుదల చేసిన నీతి ఆయోగ్, శ్రీకాకుళం నుంచి అంబేద్కర్ కోనసీమ వరకు 9 జిల్లాలను కవర్ చేసేలా ఎకనమిక్ రీజియన్ ప్రతిపాదించింది. నీతి ఆయోగ్ ప్రణాళికను ముందుకు తీసుకెళ్లే క్రమంలోనే జనవరి నెలలో ఆంధ్రప్రదేశ్ అధికారుల బృందం ముంబయిని సందర్శించింది. అక్కడి విధానాలను పరిశీలించింది.

# పల్నాడు జిల్లాలో విషాదం

## – విద్యుత్ షాక్‌తో 12 ఏళ్ల బాలుడు మృతి

**సత్తెనపల్లి:** పల్నాడు జిల్లా చంద్రరాజుపాలెం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి (కరెంట్ షాక్) గురై ఒక చిన్నారి ప్రాణాలు కోల్పోయిన ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. గ్రామానికి చెందిన యోహాన్ రాజు (12) అనే బాలుడు శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బాలుడు అపస్మారక స్థితిలోకి వెళ్లడాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా బాలుడిని హుటాహుటిన సమీపంలోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో చేర్చిన అనంతరం వైద్యులు బాలుడిని బ్రతికించేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయితే, అప్పటికే పరిస్థితి విషమించడంతో బాలుడు చికిత్స పొందుతూ కన్నుమూశాడు. కళ్లముందే ఆడుకుంటూ తిరిగిన చిన్నారి మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. చంద్రరాజుపాలెం గ్రామంలో ఒక్కసారిగా విషాదఛాయలు అలుముకున్నాయి.

# సరైన అనుమతులు లేని బిఈడి కళాశాలల అఫిలియోషన్ ను రద్దు చేయాలి



**ఎమ్మిగనూరు**ఎమ్మిగనూరు పట్టణంలో సరైన అనుమతులు లేని బి ఈ డి కళాశాలలా అఫ్లీయేషన్ ను రద్దు చేయాలని ఆర్ పి ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహిద్ ఆఫ్రిది డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ అనుబంధంగా ఎమ్మిగనూరు పట్టణంలో నాలుగు బిఈడి కాలేజీలు ఉన్నాయని వాటిలో కొన్ని కాలేజీలో అర్హతలు లేని వారిని ప్రిన్సిపాల్ గా మరియు లెక్చరర్స్ గా వీధులు నిర్వహిస్తున్నారని అంతేకాకుండా వేరే రాష్ట్రాల నుంచి బిఈడి అడ్మిషన్లు చేసుకుంటూ లక్షల కూడగట్టుకుంటున్నారని, వారు కళాశాలకు రాకపోయినా లేదా బీఈడీ బ్లాక్ టీచింగ్ మరియు ప్రాక్టికల్స్ కు రాకపోయినా వారి నుంచి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేసుకుంటున్నారని ఇంత జరుగుతున్నా కూడా యూనివర్సిటీ అధికారులు బీఈడీ కళాశాల యాజమాన్యం ఇచ్చే ముడుపులు తీసుకుని వారికే మద్దతుస్తున్నారని తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు బి ఈ డి కాలేజీల ఆఫిలియెషన్ కూడా ఆ ముడుపులు తీసుకున్న యూనివర్సిటీ అధికారులే వస్తున్నారని ఒకవేళ అలాగే జరిగితే ఖచ్చితంగా ఆర్ పి ఎస్ ఎఫ్ విద్యార్థి సంఘం గా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు ఇప్పటికైనా రాయలసీమ యూనివర్సిటీ అధికారులు స్పందించి సరైన అనుమతులు లేని బీఈడీ కళాశాలపై అలాగే వారికి వత్తాసు పలికిన రాయలసీమ యూనివర్సిటీ అధికారులు పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారికి మరియు గవర్నర్ గారికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం నాయకులు మహబూబ్, నర్సింహా నాయుడు, పైక్ష వలి, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ షాక్కు గురై తండ్రీకొడుకు మృతి

అనంత:గుమ్మగట్ట మండలం కరసూరయ్య దొడ్డి వద్ద విద్యుదాఘాతానికి గురై తండ్రీకొడుకు మృతి చెందిన విషాద ఘటన జరిగింది. బొమ్మక్కపల్లికి చెందిన ఆనంద్, అతని కొడుకు తేజ బోరు మోటార్ల రిపేరీ పనులు చేస్తూ జీవనం సాగించేవారు. శుక్రవారం కరసూరయ్య దొడ్డి వద్ద పైపులు తెస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్కు గురయ్యారు. రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

# చాగలమర్రి లో భారీ వర్షం.

**చాగలమర్రి** మండలంలో శుక్రవారం కురిసిన వర్షానికి ప్రధాన రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిండి ప్రవహిస్తున్నాయి. ఉన్న పాటన ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో వర్షం రావడంతో ప్రజలు తడిసి ముద్దయ్యారు.

అత్యధిక ఉష్ణోగ్రత తో అల్లాడుతున్న జనం వర్షంతో భూమి చల్లబడి వాతావరణం లో మార్పు వచ్చింది. కొంతమంది రైతులు రహదారులలో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. వర్షం రాకతో ఒకవైపు చల్లబడి ఉండగా, మరో వైపు రైతులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో తడిసిన ధాన్యం రంగు మారుతుందనే భయాందోళనలో రైతులు ఉన్నారు

# హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణ పనుల అనుమతులు రద్దు చేయాలి

## – ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

**అరకులోయ** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం భుర్జ పంచాయతీ కుసుమవలస గ్రామంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మాణనానికి నవయుగ కంపెనీకు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జివో నెంబర్ 13 విడుదల బడా కార్పొరేట్ నవయుగ కంపెనీ పర్యావరణము,సామాజిక ప్రభావం, జీవోలాజికల్ మ్యాపింగ్ సర్వే చేయుటకు (వేగ్ మైన్ ఎనర్జీ స్టార్ట్) అప్ కంపెనీకి అప్పగించిందని తక్షణమే జిల్లా కలెక్టర్ ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు.

వెగ్ మైన్ ఎనర్జీ కంపెనీ డైరెక్టర్ ఎస్,రిషిత సర్వే అనుమతులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ మైనింగ్, జీవోలాజికల్ అధికారులకు 23-5-2026 తేదీన సర్వే అనుమతులు ఇవ్వాలని లేఖ రాసారని అనుమతి లేఖ అందిన వెంటనే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ మైనింగ్ ,జీవోలాజికల్ అధికారులు 23-5-2026 తేదీన సర్వే అనుమతులు ఆగమేఘాల మీద మంజూరు చేస్తూ అదేరోజు ఉత్తర్వులు మంజూరు చేశారని ఆదివాసులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు అడిగితే అనేక కారణాలు చెప్పి కాలయాపన చేస్తారని ఆదివాసులకు 1/70 చట్టం, పెసా చట్టం ప్రకారం గ్రామసభ, అటవీ హక్కుల చట్టం, ఉల్లంఘించి 5 వ షెడ్యూల్ ఏరియాలో బడా కార్పోరేట్ నవయుగ సంస్థకు ఒక వైపు గ్రామ సభ అనుమతి లేకుండా నిర్మాణ పనులు జరగదని చెబుతూనే మరోవైపు గ్రామసభ సంబంధం లేకుండా గ్రామసభ నిర్వహించాకుండా అనుమతి వెగ్ మైన్ ఎనర్జీ కంపెనీ వారికి జీవోలాజికల్ మ్యాపింగ్ పర్యావరణ సామాజిక ప్రభావం పై సర్వే కోసం అనుమతి ఇవ్వడం పట్ల ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లోసురేంద్ర జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారుఆదివాసుల హక్కులు,చట్టాలు కాపాడే అధికారులు గిరిజన చట్టాలు ఉల్లంఘన చేసి ప్రైవేటు బడా కార్పొరేట్ సంస్థలైన నవయుగ కంపెనీకు ఏజెంట్ గా సహకరించే విధంగా సర్క్యులర్ ఇవ్వడం గిరిజన ప్రజలకు తీవ్ర అన్యాయం చెయ్యడమేనని తక్షణమే జిల్ల కలెక్టర్ సర్వే ఆఫ్ ఇండియా జివోలజికల్ అధికారులకు సర్వేకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని గ్రామంలో సర్వే లు అపాలని డిమాండ్ చేశారు. ఆదివాసులకు జిల్లా అధికారయంత్రాంగం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో హైడ్రో ప్రాజెక్టు వ్యతిరేక పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి బుజ్జిబాబు, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు బి దశరథ్, రామారావు, ఐసుబాబు పాల్గొన్నారు.

# హనుమకొండలో నకిలీ వైద్యుడి క్లినిక్పై డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ దాడి

**హనుమకొండ** హనుమకొండ జిల్లా యేనుగులగడ్డ ఇంద్రానగర్లో నకిలీ వైద్యుడి క్లినిక్పై డీసీఏ అధికారులు దాడి జరిపారు. బత్తుల రాజు కుమార్ అనే వ్యక్తి సరైన అర్హతలు లేకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. ఫస్ట్ ఎయిడ్ క్లినిక్లో అక్రమంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 41 రకాల మందులు, అందులో 35 రకాల ఇన్స్టిట్యూషనల్ సప్లై మందులు గుర్తింపులున్నాయి. యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, బీపీ మందులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మందుల విలువ సుమారు రూ.10,000. వుంటుంది. క్లినిక్లో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్ల వినియోగం ప్రజారోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉందని డీసీఏ హెచ్చరించింది. మందుల నమూనాలను సేకరించి విశ్లేషణకు పంపారు. కేసుపై మరింత దర్యాప్తు కొనసాగిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీఏ వెల్లడించింది. లైసెన్స్ లేని వ్యక్తులు, క్వాక్లకు మందులు సరఫరా చేసే డీలర్లపై కూడా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

# మొబైల్ రీఛార్జ్‌పై మళ్లీ భారం..? త్వరలో టారిఫ్ల పెంపుకు సంకేతాలు

**హైదరాబాద్** దేశంలోని కోట్లాది మొబైల్ వినియోగదారులకు మరోసారి షాక్ తగిలే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పెరిగిన రీఛార్జ్ ధరలతో ఇబ్బందులు పడుతున్న వినియోగదారులకు, మరోసారి టెలికాం టారిఫ్లు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. వచ్చే 3 నుంచి 6 నెలల్లో మొబైల్ రీఛార్జ్ టారిఫ్లు సుమారు 10 శాతం మేర పెరిగే అవకాశం ఉందని యాక్సిస్ క్యాపిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. సీఎన్బీసీ-టీవీ18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగినట్లుగా 15 నుంచి 20 శాతం భారీ పెంపులు ఈసారి అవసరం లేదని, కానీ టెలికాం సంస్థల ఆదాయాన్ని పెంచేందుకు పరిమిత స్థాయిలో ధరల సవరణ జరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ప్రధాన టెలికాం కంపెనీలు అయిన ఖీవశ్రీతిజీనిఱవ ఏతినీ, ఃష్ట్రజీతీబితి ఒతితీబివశ్రీ, ఎనీటజీటనీనివ ఎటవజీ తమ సేవల నాణ్యత, 5ఉ విస్తరణ, నెట్వర్క్ నిర్వహణ ఖర్చులను దృష్టిలో ఉంచుకుని టారిఫ్లను పునఃసమీక్షిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది కూడా టెలికాం సంస్థలు రీఛార్జ్ ప్లాన్ల ధరలను పెంచడంతో సాధారణ వినియోగదారులపై అదనపు భారం పడింది. ముఖ్యంగా రోజువారీ డేటా వాడే విద్యార్థులు, ఉద్యోగులు, చిన్న వ్యాపారులు ఎక్కువగా ప్రభావితమయ్యారు. ఇప్పుడు మరోసారి ధరల పెంపు జరిగితే నెలవారీ మొబైల్ ఖర్చు మరింత పెరిగే అవకాశం ఉందని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ పెంపు అన్ని ప్లాన్లపై సమానంగా ఉండకపోవచ్చని, ముఖ్యంగా అధిక డేటా వినియోగ ప్లాన్లు, అన్లిమిటెడ్ కాలింగ్ ప్యాకేజీలపై ఎక్కువ ప్రభావం ఉండే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటివరకు టెలికాం కంపెనీల నుంచి అధికారిక ప్రకటన రాకపోయినా, రాబోయే నెలల్లో మొబైల్ రీఛార్జ్ ఖర్చులు పెరిగే అవకాశాన్ని వినియోగదారులు ముందుగానే అంచనా వేసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది

# మిర్యాలగూడలో పెను విషాదం..

## – సిలిండర్ పేలి ముగ్గురి మృతి



**నల్గొండ, జూన్ 5:** మిర్యాలగూడలో పెను విషాదం చోటుచేసుకుంది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో ముగ్గురు కుటుంబసభ్యులు సజీవ దహనం అయ్యారు. అమ్మమ్మ, మనవడు, మనవరాలు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలాల్‌వాడకు చెందిన చంద్రకళ, సైదులు భార్యాభర్తలు. సైదులు అనారోగ్యం కారణంగా నెలరోజుల క్రితం చనిపోయాడు. చంద్రకళ పెద్ద కూతురు ధనమ్మ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ధనమ్మ తన ఇద్దరు పిల్లలు లక్ష్మణ్(16), ప్రణతి(14)తో పుట్టింట్లోనే ఉంటోంది. మూడు రోజుల క్రితం ఇళ్లలో పని చేసేందుకు పుణె వెళ్లింది. గురువారం రాత్రి చంద్రకళ.. మనవడు, మనవరాలితో ఇంట్లో నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్ అయింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పేలింది. ముగ్గురూ మంటల్లో చిక్కుకుని సజీవ దహనం అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయకచర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. పోలీసులు మూడు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు..

# డిసిసి బ్యాంకు చైర్మన్ మంచూరు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## – హాజరైన కడప జిల్లా కలెక్టర్ శ్రీధర్ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మినా

## – బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్

**బద్వేలు** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం పాలనను ప్రజల ముంగిలికి తేవడమే లక్ష్యంగా "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు పర్యటనలు" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది.. ఇందులో భాగంగా శుక్రవారం వై ఎస్ ఆర్ కడప జిల్లా... బద్వేలు రాఘవేంద్ర గ్రాండ్ లో "ఒక నెల – ఒక నియోజకవర్గం – నాలుగు పర్యటనలు" కార్యక్రమం ను నిర్వహించారు.

సమస్యలను విన్నవించు కోవడానికి వచ్చిన వారి నుండి అర్జీలను స్వీకరిస్తూ ..సమస్యలను సావధానంగా వింటూ సమస్య పై సంబంధిత అధికారుల తో మాట్లాడి పరిష్కారం నిమిత్తం అధికారులకు ఆదేశాలు ఇస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి. జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మినా.... ఈ కార్యక్రమము లో డి సి సి బి చైర్మన్ సూర్య నారాయణ రెడ్డి,పాల్గొన్న వివిధ శాఖల జిల్లాఅధికారులు,ఆర్డిఓ చంద్ర మోహన్,బద్వేల్ నియోజక వర్గ తహసీల్దార్లు, ఆర్ఐలు,వి ఆర్ ఓ లు...× అర్జీల నమోదు కొరకు మండలాల వారీగా ప్రత్యేక కౌంటర్ లు ఏర్పాటు చేసి అర్జీల నమోదు ప్రకియ జరిగింది సమావేశానికి బద్వేలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల బాధితులు వచ్చి అధికారులకు సమస్యలు విన్నవించుకున్నారు

# బాల్య వికాస మూల్యాంకణాలపై శిక్షణ..

**చాగలమర్రి** బాల్య వికాస స్క్రీనింగులు, ఉపయోగించే కీలకమైన మూల్యాంకణాలపై అంగన్వాడి టీచర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల శుక్రవారం తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల తొలి దశలోనే పర్యవేక్షించడానికి, స్థానిక ఆరోగ్య మహిళా అభివృద్ధి సంబంధిత సమస్యలు, వైకల్యాలను ముందుగానే గుర్తించేందుకు అంగన్వాడి టీచర్లు తెలియ చేయాల్సిన అంశాలను స్థానిక ప్రభుత్వ వైద్యశాల వైద్యులు ప్రత్యూష, డాక్టర్ అంజలి శిక్షణ ఇస్తారన్నారు. పిల్లల అభ్యాసం మాట కదలికలు, ప్రవర్తనను పర్యవేక్షించే సర్వేలు, సాధారణంగా పుట్టినప్పటి నుండి పిల్లలపై దృష్టి ఉంచే విధానాలను తెలియజేస్తారన్నారు. స్థూల సూక్ష్మ చలన నైపుణ్యాలు, మెదడు యొక్క అనుకూలతను గరిష్ట స్థాయికి పెరిగేందుకు టీచర్లు గుర్తించే విధానాలను తెలియజేస్తారన్నారు. సంరక్షకులు శిశు వైద్యులు పిల్లల రోజువారి ప్రవర్తనను పర్యవేక్షించే విధానాలను శిక్షణలో తెలియజేస్తారని ఆమె తెలిపారు. ఈ శిక్షణకు అంగన్వాడి టీచర్లు హాజరవుతున్నట్లు తెలిపారు.

# పల్నాడు జిల్లాలో స్థానిక ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఏపీ బీఎస్పీ చీఫ్ బందెల గౌతమ్ కుమార్

**నరసరావుపేట,** ఆంధ్రప్రదేశ్ బహుజన్ సమాజ్ పార్టీ చీఫ్ బందెల గౌతమ్ కుమార్ కు శుక్రవారం పల్నాడు జిల్లా బిఎస్పి నాయకులు ఘన స్వాగతం పలికారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ పల్నాడు జిల్లా నుండి స్థానిక ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. సంతమాగులూరు రోడ్డు నుండి మేల తాళాలతో డప్పు వాయిద్యాలతో గౌతమ్ కుమార్ కి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రాజు కు పల్నాడు జిల్లా బీఎస్పీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అడ్డరోడ్డు నుండి భారీ ర్యాలీతో రొంపిచర్ల మండలం ఇప్పర్ల రెడ్డి పాలెం గ్రామంలో బి.వి.ఎఫ్ జిల్లా అధ్యక్షులు బూదాల సామేలు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. వందలాది మంది కార్యకర్తలు మధ్య రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రాజు, జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు పాల్గొన్నారు. అనంతరం రొంపిచర్ల మండలం నల్లగార్లపాడు గ్రామంలో బీఎస్పీ నియోజకవర్గ నాయకులు కుంచాల శ్రీనివాసరావు, మండల నాయకులు రాఫూర్ ఏలియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పార్టీ జెండాను వందలాదిమంది కార్యకర్తలు మధ్య రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రాజు ఆవిష్కరించడం జరిగింది. అనంతరం నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామంలో బహుజన యూత్ ఫోర్స్ జిల్లా కోకన్వీనర్ మట్టి కొయ్య బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ వందలాది మంది కార్యకర్తల మధ్య ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జిల్లా అధ్యక్షులు బూదాల బాబురావు అధ్యక్షత వహించగా రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతం కుమార్ మాట్లాడుతూ, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన సమాజ్ పార్టీ జిల్లాలోని అన్ని స్థానాల నుండి పోటీ చేసి గెలిపే లక్ష్యంగా పనిచేస్తుందని కార్యకర్తలకు బహుజన సమాజ్ పార్టీ అండగా ఉంటుందని ఎవరు అధైర్య పడగలను కచ్చితంగా రాని సమస్యలు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆయన కార్యకర్తలకు దిశా నిర్దేశాన్ని చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేరెళ్ల రాజు మాట్లాడుతూ, పల్నాడు జిల్లాలో బహుజన్ సమాజ్ పార్టీ గ్రామ గ్రామాన విస్తరించి జరగబోయే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి తెనాలి ప్రకాష్, ప్రకాశం జిల్లా అధ్యక్షులు గోపిరాజు బివిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు బూదాల సామేలు, బహుజన యూత్ ఫోర్స్ జిల్లా మట్టి కొయ్య మరియు బాబు, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, కుంచాల శ్రీనివాసరావు, చక్రవర్తి, ఆలూరు రాజేష్, షేక్ ఖాజావలి, ఆదాబ్ సాహెబ్, షేక్ మస్తాన్వలి తోపాటు అధిక సంఖ్యలో బిఎస్పి కార్యకర్తలు పాల్గొన్నారు.

# గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడు అరెస్ట్

గండిపేట మండలంలోని సర్వే నెం.18లో ఉన్న సుమారు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకొని రెగ్యులరైజేషన్ చేయించుకునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు (ఈజీఎవ ఊాబ), తప్పుడు రెవెన్యూ రికార్డులు మరియు ఇతర నకిలీ పత్రాలు సృష్టించినట్లు గండిపేట తహసీల్దార్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, తేదీ 23-05-2026న నార్సింగి పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026 కింద కేసు నమోదు చేసారు. కేసు దర్యాప్తులో భాగంగా నార్సింగి పోలీసులు మరియు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు ఇప్పటివరకు పలువురు నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో నిమ్మల కుటుంబ సభ్యులు, రాధాకృష్ణ మరియు అతని డ్రైవర్ ప్రభీన్ కుమార్ ఉన్నారు. అరెస్టు చేసిన నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరచగా, తదుపరి దర్యాప్తు నిమిత్తం పోలీస్ కస్టడీ మంజూరు చేయబడింది. దర్యాప్తులో సేకరించిన ఆధారాల ప్రకారం, బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ మరియు నిమ్మల కుటుంబ సభ్యులు పరస్పర కుట్ర పన్ని ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు అధికారిక పత్రాలు మరియు నకిలీ రికార్డులు సృష్టించినట్లు వెల్లడైంది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన వివరాల ప్రకారం, ఈ కుట్రలో భాగంగా బొల్లా బ్రహ్మనాయుడు సుమారు రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిపినట్లు గుర్తించారు. అందులో నిమ్మల కుటుంబ సభ్యులకు రూ.4 కోట్లు, ఇప్పటికే అరెస్టైన నిందితుడు రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతర సంబంధిత వ్యక్తులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ఈ నిధులను నకిలీ జీవోలు, నకిలీ ప్రభుత్వ అనుమతులు మరియు తప్పుడు పత్రాల తయారీ ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించేందుకు వినియోగించినట్లు గుర్తించారు. అరెస్టుకు ముందు బొల్లా బ్రహ్మనాయుడు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, కేసు తీవ్రత, దర్యాప్తు దశ మరియు ప్రాథమిక ఆధారాలను పరిగణనలోకి తీసుకున్న గౌరవ హైకోర్టు అతని బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. అనంతరం నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన చర్యల్లో భాగంగా పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మనాయుడిని తమిళనాడులోని కాంచీపురం ప్రాంతంలో గుర్తించి ఈరోజు అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బొల్లా బ్రహ్మనాయుడు పోలీసుల అదుపులో ఉండగా, చట్టపరమైన ప్రక్రియ ప్రకారం గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచనున్నారు. కేసుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, నకిలీ పత్రాల తయారీ, ప్రభుత్వ అధికారుల పేర్లు మరియు సంతకాల దుర్వినియోగం, అలాగే కుట్రలో పాల్గొన్న ఇతర వ్యక్తుల పాత్రలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్‌పై హోంమంత్రి అనిత ప్రయాణం..

## – మొక్కలు నాటిన మంత్రి.



**విజయవాడ,** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. రామవరప్పాడు రింగ్‌లోని ఎస్ఎల్వీ గ్రీన్ మెడోస్ నివాసం నుంచి ఆటోనగర్‌లోని ఫైర్ స్టేషన్ కార్యాలయం వరకు ఆమె సైకిల్‌పై వెళ్లారు. అనంతరం ఫైర్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తన వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత రాష్ట్ర ప్రజలకు పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని హోంమంత్రి పేర్కొన్నారు. చెట్ల పెంపకం పర్యావరణాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం "నో వెహికల్ డే"గా నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా పాటించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. పర్యావరణాన్ని కాపాడటమే భావితరాలకు మనం అందించే గొప్ప ఆస్తి అని ఆమె అన్నారు. సైకిల్‌పై ప్రయాణించడం గర్వకారణమని, సైకిల్ వినియోగం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన తొలి రోజునే విజయవాడ నగర వీధుల్లో సైకిల్‌పై తిరగడం ఎంతో ఆనందంగా ఉందని హోంమంత్రి తెలిపారు. జీవితం చాలా చిన్నదని, ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం గంట సమయాన్ని తమ ఆరోగ్యం కోసం కేటాయించాలని సూచించారు. సైకిల్ వినియోగాన్ని పెంచడంతో పాటు బ్యాటరీ వాహనాల వినియోగాన్నీ ప్రోత్సహించాలని హోంమంత్రి అనిత ప్రజలకు పిలుపునిచ్చారు.

# ప్రయోగాత్మకంగా "శ్రీవారి వైద్య సేవ" ప్రారంభం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ ఆసుపత్రుల్లో "శ్రీవారి వైద్య సేవ" కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణుల సేవలను శ్రీవారి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రయోగాత్మక దశలో కార్యక్రమాన్ని అమలు చేసి, పాల్గొనే వైద్య నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించి మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు విద్య, వైద్యం, ఐటీ తదితర రంగాల్లో సేవా భావంతో ముందుకు వచ్చే నిపుణులకు టీటీడీ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. టీటీడీ ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో సేవలందించేందుకు వచ్చే నిపుణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసి ఎక్కువ మంది నిపుణుల సేవలను వినియోగించుకునేలా చర్యలు చేపడతామని వివరించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు, వైద్య నిపుణులు తమకు అనుకూలమైన తేదీల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సేవలందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులకు మూడు రోజుల పాటు, ఎంబీబీఎస్ వైద్యులకు ఏడు రోజుల పాటు స్వచ్ఛంద సేవ చేసే అవకాశం కల్పించనున్నారు. వీరికి తిరుమల, తిరుపతిలో వసతి, భోజన సౌకర్యాలు టీటీడీ ద్వారా అందించబడతాయి.

## రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని

# వెంటనే కొనుగోలు చేయాలి

- ప్రభుత్వానికి ఎంత చెప్పినా చెవికెక్కడం లేదు.
- రైతులకు ఇన్ని కష్టాలు వచ్చినా ఎమ్మెల్యే కనిపించడం లేదు.
- మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మా దేవేందర్ రెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) భారీ వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం రాయలపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. అనంతరం మండల నాయకులు, రైతులతో కలిసి మెదక్ సిద్దిపేట హైవే పైన రోడ్డుపై మొలకెత్తిన ధాన్యం పోసి ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో సుమారు 20 లారీల ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు చేయలేదని రైతులు తమకు వివరించారని తెలిపారు.శుక్రవారం కురిసిన భారీ వర్షంతో 2 కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేయాలని పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు.రైతులకు ఇంతటి కష్టాలు వచ్చినా స్థానిక ఎమ్మెల్యే కనిపించడం లేదని మండిపడ్డారు. రైతుల సమస్యలను తెలుసుకునేందుకు కూడా ఎమ్మెల్యే ముందుకు రాకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి మాదిరిగానే ఎమ్మెల్యే కూడా రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.మరో రెండు రోజుల్లో మృగశిర కార్తె ప్రారంభం కానున్న నేపథ్యంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని, దీంతో ధాన్యం పూర్తిగా పాడయ్యే ప్రమాదం ఉందన్నారు.తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని డిమాండ్ చేశారు.లారీల కొరత, కూలీల కొరత కారణంగా ధాన్యం తరలింపు నిలిచిపోయిందని, దీనివల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైస్‌మిల్లర్లు సంచికి అదనంగా ఐదు కిలోల ధాన్యం వేస్తేనే తీసుకుంటామని చెప్పడం వల్ల రైతులు క్వింటాలుకు 12 కిలోల వరకు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు.రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వెంటనే అధికారులు స్పందించి రాయలపూర్‌లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, అవసరమైన లారీలను పంపి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రామాయంపేట సొసైటీ చైర్మన్ బాదే. చంద్రం,మున్సిపల్ మాజీ చైర్మన్ జితేందర్ గౌడ్,నిజాంపేట్ ఎంపీపీ సంపత్,సీనియర్ నాయకులు చౌదరి. సుప్రభాతారావు,మాజీ సర్పంచ్ నర్స గౌడ్, మాజీ ఎంపీటీసీ సత్యం ,బిక్షపతి,నాయకులు ఉమామహేశ్వర్,అబ్దుల్ అజిజ్, హస్నొద్దీన్,రొయ్యల నవీన్, మధుకర్ రాంకీ శ్రావణ్, మహేష్, రంజిత్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్,నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా, బాలల సంక్షేమానికి

# సమిష్టి కృషి అవసరం

- భరోసా సేవల్లో శాఖల మధ్య సమన్వయం పెంచాలి
- ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మహిళలు, చిన్నారులపై జరిగే హింస, వేధింపుల కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం అందించడంతో పాటు రక్షణ, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పునరావాస సేవలు సమర్థవంతంగా అందించేందుకు సంబంధిత అన్ని శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం భరోసా కార్యక్రమానికి సంబంధించిన కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు, చిన్నారుల సంక్షేమానికి సంబంధించిన వివిధ శాఖల అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నమోదవుతున్న కేసుల్లో వేగవంతమైన దర్యాప్తు జరగడంతో పాటు బాధితులకు అవసరమైన అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య, న్యాయ, కౌన్సెలింగ్, పునరావాస సేవల కల్పనలో పోలీసు శాఖతో పాటు ఇతర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. బాధితులకు సేవలు అందించే ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు ఒకే వేదికపై అన్ని రకాల సహాయ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కేంద్రాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కేసుల పరిష్కారంలో ప్రతి శాఖ తన బాధ్యతలను సమయానుకూలంగా నిర్వర్తించడంతో పాటు రిఫరల్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బాధితులు అవసరమైన సేవల కోసం వివిధ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే చోట అన్ని సౌకర్యాలు పొందేలా చర్యలుతీసుకోవాలన్నారు.సమావేశంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఐపీఎస్, డియస్పి ప్రసన్న కుమార్, భరోసా కోఆర్డినేటర్ సౌమ్య, చైల్డ్‌లైన్ ప్రతినిధులు, సీడబ్ల్యూసీ, జేజేబీ సభ్యులు, డీఎల్‌ఎస్‌ఏ ప్రతినిధులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, మహిళా--శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఎస్‌ఈఆర్‌పీ ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దర్యాప్తు అధికారులు, షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపీ నిధులతో సిసి రోడ్లు పనులు ప్రారంభించిన సర్పంచ్ సాదుల సప్న ఉశయ్య,



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. సిసి రోడ్డు నిర్మాణం పనుల కొరకు ఎంపీ నిధుల నుండి పది లక్షల రూపాయలు మంజూరు అయినవి అని గ్రామ సర్పంచ్ స్వప్న ఊష య్య తెలిపారు.గ్రామ అభివృద్ధిలో భాగంగా ఒకటవ వార్డు, పదవ వార్డులలో నూతనంగా చేపట్టనున్న 250 మీటర్ల సిసి రోడ్డు నిర్మాణ పనులు శుక్రవారం గ్రామ సర్పంచ్ స్వప్న ఊష య్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలపడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రజల సౌకర్యార్థం రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. నాణ్యత ప్రమాణాలతో ఈ రోడ్డు పనులను గడువులోగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ నిధుల నుండి మంజూరు చేయించిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు కు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్డు పనులు ప్రారంభం కావడం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చందాపురం నిర్మల శేఖర్ యాదవ్ , మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి, వెంకట రాములు ,పంచాయతీ సెక్రెటరీ మమత, వార్డు మెంబర్స్ అక్కెం ప్రవీణ్ యాదవ్, తోశ నవీన్, పసుల రేఖ యాదగిరి, నాయకులు ఎంచర్ల శేఖర్ యాదవ్,ఎంబరి శేఖర్ వడ్ల సంతోష్ కుమార్ గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

# స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యక్రమాలు

## - మల్కాజిగిరి పరిధిలో 500 మంది పోలీసుల తనిఖీలు





మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి సీపీ సుమతి తన పనితీరుతో సర్వత్రా ప్రశంసలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. కొన్ని రోజుల క్రితం మహిళల భద్రతను స్వయంగా పర్యవేక్షించేందుకు దిల్‌సుఖ్‌నగర్‌లో సివిల్ డ్రెస్‌లో రాత్రి పూట గస్తీ కాసిన సీపీ సుమతి తాజాగా మరో భారీ ఆపరేషన్ చేపట్టారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉన్న స్పా సెంటర్లపై మెరుపు దాడులు చేశారు. మల్కాజిగిరి సీపీ సుమతి ఆధ్వర్యంలో దాదాపు 500 మంది పోలీసులు శుక్రవారం రోజున ఏకకాలంలో ఏకంగా 113 స్పా సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు. స్పా సెంటర్ల పేరుతో అక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించారు.

మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని స్పా సెంటర్లలో అక్రమాలు, అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు నిర్ధారించుకున్న పోలీసులు అక్కడికి వచ్చే కస్టమర్ల వివరాలు నమోదు చేసే రిజిస్టర్‌ను కూడా స్పా సెంటర్ నిర్వాహకులు సరిగ్గా రికార్డు చేయడం లేదని పోలీసుల విచారణలో గుర్తించారు. అదే సమయంలో స్పా సెంటర్లకు ఇళ్లను అద్దెకు ఇస్తున్న ఓనర్లను కూడా పోలీసులు విచారణ జరిపారు. స్పా సెంటర్ల ఓనర్లు ఇచ్చే అద్దెను తీసుకోవడం తప్ప.. అక్కడ ఏం జరుగుతుంది అని కూడా యజమానులు పట్టించుకోవడం లేదని పోలీసుల విచారణలో వెల్లడైంది.

ఈ క్రమంలోనే ఈ తనిఖీల్లో చాలా స్పా సెంటర్లలో చాలా అక్రమాలు జరుగుతున్నాయని పోలీసులు గుర్తించారు. వీటిపై ఆ స్పా సెంటర్లకు అద్దెకు ఇచ్చిన ఇంటి ఓనర్లు ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడం లేదని పోలీసులు తేల్చారు. హైదరాబాద్ నగరంలో భారీగా ఉన్న స్పా సెంటర్ల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని నిత్యం పోలీసులకు ఫిర్యాదులు అందుతూనే ఉన్నాయి. దీంతో ఆ ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్న మల్కాజిగిరి పోలీసులు ఆకస్మికంగా దాడులు చేస్తున్నారు.ఈ సందర్భంగా ఆయా స్పా సెంటర్లపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఒకేసారి భారీగా స్పా సెంటర్లపై పోలీసులు ఒకేసారి దాడులు చేయడం ఇదే తొలిసారి అని సంబంధిత వర్గాలు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే స్పా సెంటర్ల నిర్వహణ విషయంలో కఠిన నిబంధనలు అమలు చేయాలని నగరవాసులు పోలీసులకు విజ్ఞప్తి చేస్తున్నారు. స్పా సెంటర్ల పేరుతో అసాంఘిక చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేయొచ్చని పోలీసులను కోరుతున్నారు. ఈ క్రమంలోనే మల్కాజిగిరి సీపీ సుమతిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

## చొప్పదండిని మోడల్ నియోజకవర్గంగా

# తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే సత్యం

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : మంత్రి మహేందర్
- కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు



గంగాధర (ప్రశ్న న్యూస్) చొప్పదండి ఎమ్మెల్యే ,కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను గంగాధర మండలం, మధురానగర్‌లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మహేందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరుతో పాటు రైతులకు సాగునీరు, ధాన్యం కొనుగోలు వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే సత్యం ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని,మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ముద్దం నగేష్, దుబ్బాసి బుచ్చయ్య, వేముల భాస్కర్, రామిడి రాజిరెడ్డి, రేండ్ల శ్రీనివాస్, చిందం ఆంజనేయులు, సత్తు కనకయ్య, పడాల రాజన్న, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, గుజ్జుల బాపురెడ్డి, రొమాల రమేష్, రాచమల్ల భాస్కర్ తదితర కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీ భీమేశ్వరస్వామి సేవలో

# చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

- రాష్ట్ర ప్రజలందరూ సుఖక్షంగా ఉండాలి
- చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు
- డాక్టర్ మేడిపల్లి సత్యం



వేములవాడ (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు (ఐఎన్‌సీ) డాక్టర్ మేడిపల్లి సత్యం తమ జన్మదినం సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు ఆలయ అర్చకులు, వేద పండితులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయనకు వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా, తీర్థ ప్రసాదాలను అందించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రోటోకాల్ పర్యవేక్షకులు గౌరీభట్ల శ్రీనివాస్ శర్మ స్వామివారి శేషవస్త్రంతో పాటు లడ్డు ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. జన్మదిన వేడుకల సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందిన మేడిపల్లి సత్యం రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయ సందర్శన అనంతరం ఆయనకు పలువురు భక్తులు, నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## కొదురుపాక, వెంకట్రావుపల్లిలో

# బస్ షెల్టర్లు నిర్మించాలి

- రౌండప్ బోర్డు సుందరీకరణ,మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టాలి
- మండల సీపీఎం కన్వీనర్ : గురిజాల శ్రీధర్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని కొదురుపాక,వెంకట్రావుపల్లి స్టేజీల వద్ద బస్ షెల్టర్లు, మహిళల కోసం టాయిలెట్ సౌకర్యాలు, అలాగే కొదురుపాక రౌండప్ బోర్డు సుందరీకరణ పనులను తక్షణమే చేపట్టాలని సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు, టాయిలెట్లు లేకపోవడంతో మహిళలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. కనీసం కూర్చునేందుకు కూడా సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ పాలకులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ఈ సమస్యలపై దృష్టి సారించి, యుద్ధ ప్రాతిపదికన బస్ షెల్టర్లు, టాయిలెట్లు నిర్మించడంతో పాటు కొదురుపాక రౌండప్ బోర్డు చౌరస్తా సుందరీకరణ పనులను ప్రారంభించాలని కోరారు. మహిళల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున మహిళలను సమీకరించి రహదారి దిగ్బంధన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే వెంటనే స్థల సేకరణ చేపట్టి అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గురిజాల శ్రీధర్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రామంచ అశోక్, మండల నాయకుడు కుడుకల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర తెలంగాణ అభివృద్ధికి

# నూతన దిశ...! బీజేపీ శ్రేణుల హర్షం...!!

- రూ.7597 కోట్ల వ్యయంతో హైవే ప్రాజెక్ట్
- బండి సంజయ్ కృషితోనే ప్రాజెక్ట్ సాధ్యం - బీజేపీ నేతలు
- ప్రధాని మోదీ, బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)ఎన్ హెచ్-63, ఎన్ హెచ్-563 జాతీయ రహదారులను రూ.7,597 కోట్ల వ్యయంతో నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలపడంతో బోయినిపల్లి మండల బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టుతో కరీంనగర్, జగిత్యాల,పరకాల,వరంగల్ ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడి వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య రంగాలకు ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ఆమోదానికి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి,బండి సంజయ్ కృషి కీలకమని కొనియాడుతూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మైలురాయిగా నిలుస్తుందని బీజేపీ నేతలు పేర్కొన్నారు.

# ఆరు గ్యారంటీలు గాలికొదిలి.. పవన్‌పై ఆరోపణలా.?

**- రాష్ట్ర ప్రభుత్వంపై జనసేన నేత కమ్మరి శ్రీనివాస్ ఘాటు విమర్శలు**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలును పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై దృష్టి సారించకుండా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై ఆరోపణలు చేయడం దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని జనసేన రాష్ట్ర నాయకుడు కమ్మరి శ్రీనివాస్ మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కళ్యాణలక్ష్మి పథకంతో పాటు తులం బంగారం హామీని అమలు చేయకుండా గాలికి వదిలేసిందన్నారు. ఆసరా పెన్షన్లు, రైతు బీమా, రైతు బంధు వంటి కీలక సంక్షేమ పథకాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. పవన్ కళ్యాణ్‌పై కొందరు చేస్తున్న విమర్శలను ఖండించిన ఆయన, తెలంగాణలోనూ జనసేన పార్టీ సిద్ధాంతాలను విశ్వసించే లక్షలాది మంది అభిమానులు ఉన్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని విశ్వసించి ఆదరించారని, ఆయనకు తెలంగాణపై ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు కావాలనే జనసేన పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారమే జనసేన లక్ష్యమని, పార్టీ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లాలో పార్టీ బలోపేతంతో పాటు రైతు సమస్యలపై పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని తెలిపారు. తెలంగాణలో జనసేన పార్టీకి ప్రజలు మరింత ఆదరణ ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఉద్దేశించి, కరీంనగర్‌లో పోటీ చేయకుండా హుస్నాబాద్‌లో ఎందుకు పోటీ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను విశ్వసించే తాము పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని స్పష్టం చేశారు.

### వివిధ పార్టీల నుంచి చేరికలు

సమావేశం అనంతరం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన పలువురు కార్యకర్తలు కమ్మరి శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. జనసేన బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

**- ప్లాస్టిక్ వాడకానికి స్వస్తి పలకాలి**

**- విలాసాగర్ సర్పంచ్ : ఏనుగుల కనకయ్య**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా విలాసాగర్ గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో గ్రామంలోని దుకాణాలను సందర్శించి వ్యాపారులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హానికరమని పేర్కొంటూ, ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో వస్త్ర సంచులు, ఇతర పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పోలె శేఖర్, దమ్మ వెంకటరమణ, పైండ్ల అనిల్, జోగు శంకర్, కాంగ్రెస్ నాయకులు ఏనుగుల ప్రశాంత్ కుమార్, ఏనుగుల అనిల్ కుమార్, కల్లేపల్లి సతీష్, బొప్పెన అనిల్ కుమార్, గ్రామ కార్యదర్శి జనగం శేఖర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# శాత్రాజుపల్లి చెరువులో జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు

**- జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారికి గ్రామస్థుల ఫిర్యాదు**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ చెరువులో అనుమతికి మించి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ గ్రామస్థులు, రైతులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా మైనింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. చెరువులో జరుగుతున్న మట్టి తరలింపును వెంటనే నిలిపివేయాలని కోరారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, శాత్రాజుపల్లి గ్రామ చెరువు నుంచి 1000 క్యూబిక్ మీటర్ల మట్టిని మాత్రమే తరలించేందుకు జగిత్యాలకు చెందిన కాంట్రాక్టర్లు కావటి గంగధర్, బొడ్డుపెల్లి జగన్‌రాజుకు అనుమతి మంజూరైంది. అయితే గత ఐదు రోజులుగా మూడు పోక్లెయిన్లు, సుమారు 50 టిప్పర్ల సహాయంతో అనుమతికి మించి భారీగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే దాదాపు 10 వేల క్యూబిక్ మీటర్లకు పైగా మట్టిని చెరువు నుంచి తరలించారని, ఇంకా తవ్వకాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. దీంతో చెరువులోని నల్లమట్టి పూర్తిగా తొలగిపోయే ప్రమాదం ఉందని, భవిష్యత్తులో గ్రామ ప్రజలు, రైతులకు అవసరమైన మట్టి అందుబాటులో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమతులను ఉల్లంఘించి మట్టి తరలింపునకు పాల్పడుతున్న కాంట్రాక్టర్లపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే చెరువులో జరుగుతున్న మట్టి తవ్వకాలను వెంటనే నిలిపివేసి గ్రామ ప్రజల, రైతుల ప్రయోజనాలను కాపాడాలని జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారిని విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గుడిసె సదానందం, మాజీ ఉపసర్పంచ్‌లు రేగుల రాజేశం, నల్ల సతీష్ రెడ్డి, మ్యాకల శ్రీనివాస్, గుడిసె అనిల్, శివ శ్రీనివాస్, మ్యాకల కరుణాకర్ తదితరులు ఉన్నారు.

# శామీర్‌పేట పెద్ద చెరువులో అక్రమ పైప్‌లైన్ ధ్వంసం

**- భారీ కాలువ తవ్వకం.. రహస్యంగా వ్యవసాయ క్షేత్రానికి నీటి తరలింపు**

**- అక్రమ పైప్‌లైన్ల కూల్చివేత.. స్థానికుల్లో హర్షం - నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు : ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల హెచ్చరిక**





**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ అనుమతులు లేకుండా సహజ వనరులను స్వప్రయోజనాల కోసం వాడుకోవడం ముమ్మాటికీ చట్టవిరుద్ధమని అధికారులు స్పష్టం చేశారు. పూడూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని శామీర్‌పేట పెద్ద చెరువును ఆసరాగా చేసుకుని నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నీటి దోపిడీకి ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు అడ్డుకట్ట వేశారు. ఒక ప్రైవేట్ వ్యక్తి ఏర్పాటు చేసిన భారీ అక్రమ పైప్‌లైన్ నిర్మాణాలను అధికారులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, జేసీబీ సహాయంతో పూర్తిగా ధ్వంసం చేశారు.

### భారీ కాలువ తవ్వకం.. రహస్యంగా వ్యవసాయ క్షేత్రానికి నీటి తరలింపు..

శామీర్‌పేట పెద్ద చెరువు చుట్టుపక్కల రైతుల సాగునీటి అవసరాలకు, భూగర్భ జలాల పెంపునకు ప్రధాన వనరుగా ఉంది. అయితే, స్థానికంగా ఉన్న ఒక ప్రైవేట్ వ్యక్తి ఇరిగేషన్ మరియు రెవెన్యూ శాఖల నుండి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా, నిబంధనలను బేఖాతరు చేశాడు. చెరువు పరివాహక ప్రాంతం నుండి తన సొంత వ్యవసాయ క్షేత్రం వరకు భారీ కాలువ తవ్వి, అందులో పెద్ద ఎత్తున పైప్‌లైన్లను ఏర్పాటు చేశాడు. దీని ద్వారా చెరువులోని నీటిని అక్రమంగా తరలించేందుకు సిద్ధమయ్యాడు. ఈ వ్యవహారంపై స్థానిక రైతుల నుండి అధికారులకు ఫిర్యాదులు అందడంతో వెంటనే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా స్పందించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డి, ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ ఈర్షద్, జీపీఓ సునీతలు తమ సిబ్బందితో కలిసి అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతానికి చేరుకున్నారు. చెరువు పరిసరాలను, పైప్‌లైన్ వేసిన మార్గాన్ని పరిశీలించి ప్రభుత్వ ఆస్తులను, సహజ వనరులను దుర్వినియోగం చేస్తున్నట్లు నిర్ధారించుకున్న అధికారులు, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ఆ అక్రమ నిర్మాణాలను అక్కడికక్కడే కూల్చివేయాలని ఆదేశించారు.

### అక్రమ పైప్‌లైన్ల కూల్చివేత.. స్థానికుల్లో హర్షం..

అధికారుల సమక్షంలో సిబ్బంది రంగంలోకి దిగి చెరువు నుండి వ్యవసాయ క్షేత్రానికి అనుసంధానించిన పైప్‌లైన్ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేశారు.

కాలువను తిరిగి పూడ్చివేసేలా చర్యలు చేపట్టారు. ప్రభుత్వ వనరులను ఆక్రమించి స్వప్రయోజనాలకు వాడుకోవాలని చూస్తే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని అధికారులు ఈ సందర్భంగా నిరూపించారు. అధికారుల తక్షణ చర్య పట్ల స్థానిక రైతులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

### కఠిన చర్యలు తప్పవు : అధికారుల హెచ్చరిక

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి చెరువులు, కుంటల నుండి అక్రమంగా నీటిని తరలించడానికి ప్రయత్నిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయి. సహజ వనరులు అందరికీ సమానంగా చెందాలి. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని ఇలాంటి అక్రమ తవ్వకాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడానికి కూడా వెనుకాడబోమని ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ ఈర్షద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చందన్ రెడ్డిలు హెచ్చరించారు.

# సమకాలీన రాజకీయాలపై అధ్యయనం చేసి సుశిక్షిత కమ్యూనిస్టులుగా ఎదగాలి

**- సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే : చాడ వెంకటరెడ్డి**

**- వేములవాడలో మూడురోజుల సీపీఐ నేతల శిక్షణా శిబిరానికి శ్రీకారం**



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల సీపీఐ కౌన్సిల్ సభ్యుల రాజకీయ శిక్షణా శిబిరాన్ని సీపీఐ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. సమకాలీన రాజకీయ పరిణామాలపై అవగాహన పెంపొందించుకొని సుశిక్షిత కమ్యూనిస్టులుగా తయారుకావాలని ఆయన పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు జెండా ఆవిష్కరించారు. దేశంలో సామాజిక న్యాయం క్షీణించిందని, కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. తెలంగాణలో బీజేపీ విస్తరణకు పవన్ కళ్యాణ్ ను ఉపయోగించుకుంటున్నారని, తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలపై ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కేంద్రం–రాష్ట్రం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలవేన శంకర్, పంజాల శ్రీనివాస్, తాండ్ర సదానందం, చెన్న విశ్వనాథం, గుంటి వేణు, కడారి రాములు, పొనగంటి కేదారి, గోషిక మోహన్, గౌతం గోవర్ధన్, ఎల్ల దేవరాజ్, పంతం రవి, సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్, కె.వి. అనసూయ తదితరులు పాల్గొన్నారు. తొలి రోజు శిక్షణలో తక్కళ్ళపల్లి శ్రీనివాస్‌రావు, మధూకర్, బీఎస్ మోహన్ రెడ్డి తరగతులు నిర్వహించారు. ం

# పచ్చదనం పెంపొందిద్దాం - పర్యావరణాన్ని కాపాడుకుందాం

**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి సమతుల్యతను కాపాడుకోవాలంటే మొక్కల పెంపకం ఎంతో అవసరమని, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయే తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కుసుంబ మహేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి స్వప్న,తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సత్యం నాయకత్వం యువతకు ఆదర్శం

**- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : కొమ్మనబోయిన సువీన్ యాదవ్**

**- ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలు**

**- సేవా కార్యక్రమాలతో కాంగ్రెస్ శ్రేణుల సందడి**





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బోయినిపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మనబోయిన సువీన్ యాదవ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ఎమ్మెల్యేపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. జన్మదిన వేడుకల్లో భాగంగా తడగొండ సాయిబాబా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే సత్యం ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని కోరుతూ నాయకులు ప్రార్థనలు చేశారు. అనంతరం బోయినిపల్లి మండల కేంద్రంలో భారీ కేక్ కట్ చేసి కార్యకర్తలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా వరదవెల్లి గ్రామంలో భారీ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రక్తదాతలను సువీన్ యాదవ్ అభినందించి వారికి పండ్లు, జ్యూస్ అందజేశారు. ఈ సందర్భంగా సువీన్ యాదవ్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడని అన్నారు. ప్రజాసేవే ధ్యేయంగా రాజకీయాల్లో ముందుకు సాగుతున్న సత్యం నాయకత్వం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించి, చొప్పదండి నియోజకవర్గానికి మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమాల అనంతరం కార్యకర్తలు మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో మండలంలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు, యువజన కాంగ్రెస్ ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శిశు మందిర్ ఆధ్వర్యంలో సీడ్ బాల్స్ పంపిణీ

**కరీంనగర్** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విద్యార్థులు పండ్ల మొక్కలను నాటి, స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి, పర్యావరణ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆచార్యులు విద్యార్థులకు సూచించారు

."ఒక్క విద్యార్థి ? ఒక్క మొక్క" అనే నినాదంతో స్థానిక అంబేద్కర్ స్టేడియంలో సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలంలో ఈ సీడ్ బాల్స్‌ను ఖాళీ ప్రదేశాల్లో వేయడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని, ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రధాన అంశం "క్లైమేట్ ఆక్షన్ –నౌ ఫర్ క్లైమేట్ " అని పేర్కొంటూ, భూమిని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, పర్యావరణ పరిరక్షణను వ్యక్తిగత బాధ్యతగా భావించి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, డీవైఎస్వో ఉట్కూరు శ్రీనివాస్ గౌడ్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు వెల్దండి దామోదర్, బైరి శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సంపత్, సూర శివశంకర్, నాగరాజు, పాఠశాల కమిటీ సభ్యులు కొత్తూరి ముకుందం, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, డాక్టర్ నాళ్ల సత్య విద్యాసాగర్, పులాల శ్యామ్, తాటి రాజేశ్వర్‌రావు, రాపర్తి శ్రీనివాస్, నడిపెల్లి దీన్‌దయాల్, అప్పిడి వకులదేవి, ఆచార్య బృందం, విద్యార్థులు మరియు పలువురు పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు.



# ట్రోల్స్ పట్టించుకోను: నిధి అగర్వాల్

టాలీవుడ్ యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ కి ఈ మధ్య కాలంలో అదృష్టం పెద్దగా కలిసిరావడం లేదు. 'హరి హర వీరమల్లు', 'ది రాజా సాబ్' లాంటి పెద్ద చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోవడంతో... సోషల్ మీడియాలో నిధిపై కొందరు నెటిజన్లు తీవ్రంగా నెగెటివ్ కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. కేవలం టాలెంట్ ఉంటే సరిపోదని, ఇండస్ట్రీలో రాణించడానికి అదృష్టం కూడా ఉండాలంటూ విమర్శిస్తూ.. ఆమెను 'ఐరన్ లెగ్' అంటూ దారుణంగా ట్రోల్ చేయడం స్టార్ట్ చేశారు. ఈ ట్రోల్స్‌పై నిధి అగర్వాల్ స్పందిస్తూ... తాను విమర్శలను పట్టించుకోనని చెప్పింది. పొగడ్తలను కూడా తలకెక్కించుకోనని స్పష్టం చేసింది. విజయవంతమైన నటిగా పేరు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుందని... తాను కూడా దానికి మినహాయింపు కాదని తెలిపింది. సినిమా సక్సెస్ అనేది కేవలం ఒకరిద్దరి మీద కాకుండా చాలా విషయాలపై ఆధారపడి ఉంటుందని ఆమె అభిప్రాయపడింది. తను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయినప్పుడు చాలా సంతోషించానని, ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, తనను తాను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తానని తెలిపింది. తాను 'లక్' కంటే కేవలం తన 'టాలెంట్'ను మాత్రమే నమ్ముకుంటానని తేల్చి చెప్పింది.

# 'పెద్ది'కి ఊహించని షాక్..

## రెండో రోజే ఆన్‌లైన్‌లోకి వచ్చేసిన హై క్వాలిటీ ప్రింట్స్!

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన పాన్-ఇండియా స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. అయితే ఈ సినిమా పైరసీ బారినపడడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకవైపు బాక్సాఫీస్ వద్ద 'పెద్ది' కలెక్షన్ల వర్షం కురిపిస్తుండగా.. మరోవైపు చిత్రబృందానికి పైరసీ రూపంలో ఊహించని షాక్ తగిలింది. సినిమా విడుదలైన రెండో రోజే పలు పైరసీ వెబ్‌సైట్లలో హై క్వాలిటీ (హెచ్‌డీ) ప్రింట్ లీక్ అయింది. థియేటర్లలో విజువల్ వండర్‌గా ప్రశంసలు అందుకుంటున్న ఈ సినిమా, ఇంత త్వరగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రావడం పట్ల చిత్ర పరిశ్రమ వర్గాలు, అభిమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ లీకేజీ సినిమా లాంగ్ రన్ వసూళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో మెగా అభిమానులు సోషల్ మీడియా వేదికగా పైరసీ లింకులను వెంటనే తొలగించాలని, ఈ చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులను కోరుతున్నారు. ఈ పైరసీ గండాన్ని దాటుకుని 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో వేచి చూడాలి. భారీ అంచనాల నడుమ విడుదలైన ఈ చిత్రం, తొలిరోజే రికార్డు స్థాయి వసూళ్లను సాధించింది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించారు. చాలా కాలం తర్వాత రామ్ చరణ్ కెరీర్‌లో ఇంతటి పవర్‌ఫుల్ హిట్ పడటంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. చిత్ర నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించిన వివరాల ప్రకారం, 'పెద్ది' తొలిరోజే ప్రపంచవ్యాప్తంగా ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది. రామ్ చరణ్ సోలో కెరీర్‌లో ఇదే ఆల్-టైమ్ రికార్డు కావడం విశేషం. ఈ అద్భుతమైన విజయాన్ని పురస్కరించుకుని, మేకర్స్ 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. గ్రామీణ క్రీడా నేపథ్యంతో కూడిన ఈ యాక్షన్ డ్రామాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.



# '29' మూవీ రివ్యూ!



కోలీవుడ్ నుంచి వచ్చే లవ్ స్టోరీస్ లో మంచి ఫీల్ ఉంటుంది. అందువలన ప్రేమకథాంశంతో కూడిన తమిళ సినిమాలకు ఓటీటీలో మంచి ఆదరణ లభిస్తూ ఉంటుంది. అలా ఈ మధ్య కాలంలో తమిళంలో రూపొందిన లవ్ స్టోరీనే '29'. రత్నకుమార్ వినిపించిన ఈ కథ వినగానే, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ .. కార్తీక్ సుబ్బరాజు నిర్మాతలుగా ముందుకు రావడం విశేషం. మే 8వ తేదీన థియేటర్లకు వచ్చిన ఈ సినిమా, (జూన్ 5వ తేదీ) నుంచి 'నెట్ ఫ్లిక్స్'లో ఐదు భాషల్లో అందుబాటులోకి వచ్చింది. సత్య (విధు) తన తల్లిదండ్రులతో కలిసి 'సేలమ్'లో నివసిస్తూ ఉంటాడు. సత్య మొదటి నుంచి ముక్కుసూటి మనిషి. లోపల ఒకలా .. బయటికి ఒకలా ఉండటం అతనికి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. తనకి నచ్చినట్టుగా బ్రతకడమే తనకి ఇష్టం. అందుకోసమే అతను 'సేలం' నుంచి చెన్నైకి వెళతాడు. అక్కడే అతను మణి .. వసంత్ అనే స్నేహితులతో కలిసి ఒక రూమ్ లో ఉంటూ ఉంటాడు. జాబ్ విషయంలో అంతగా సంతృప్తి లేకపోయినా, ఖర్చుల కోసం నెట్టుకొస్తుంటాడు. 29 ఏళ్లు వచ్చినా తనని ఎవరూ ప్రేమించకపోవడం .. తనకంటూ ఒక లవర్ లేకపోవడం సత్యకు నిరాశను కలిగిస్తూ ఉంటుంది. అలాంటి పరిస్థితులలోనే అతనికి విజయలక్ష్మి (ప్రీతి అస్రాని) పరిచయమవుతుంది. ఆమెతో పరిచయం ప్రేమగా మారుతుంది. ఐఏఎస్ కావాలనేది విజయలక్ష్మి ఆశయం. అందుకోసం ఆమె కష్టపడి చదువుతూ ఉంటుంది. ఒక లక్ష్యం .. గమ్యం అనే ఆలోచన లేకుండా సత్య ఉండటం ఆమెకి అసంతృప్తిని కలిగిస్తూ ఉంటుంది.

విజయలక్ష్మికి తన తండ్రి ఎలా ఉంటాడనేది తెలియదు. తన చిన్నతనంలోనే వెళ్లిపోయిన తండ్రిని ఒకసారి చూడాలనే కోరిక ఆమెలో బలంగా ఉంటుంది. తల్లి కోరిక మేరకు తాను బాగా చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాన్ని చేయాలనే పట్టుదలతో ఉంటుంది. ఒక వైపున ప్రేమ అంటూ వెంటపడే సత్య. మరొక వైపున చదువు పూర్తి చేయమనే తల్లి. అలాంటి పరిస్థితులలో ఆమె ఏం చేస్తుంది? ఆమె తీసుకునే నిర్ణయం వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ. కాలేజ్ చదువైపోయిన తరువాత ఒక్కో ఏడాది గడిచిపోతుంటే, ఇక జాబ్ రాదేమోననే టెన్షన్ సహజంగానే ఉంటుంది. అవకాశాలు వెదుక్కుంటూ వెళ్లకపోతే వెనకబడిపోతున్నామనే భయం మొదలవుతుంది. ఉన్న ఊళ్లోనే గొడవలు పడుతూ అవమానాలు పొందడం అలవాటైపోతుంది. అయితే '29' ఏళ్లు వచ్చినా ప్రేమలో పడకపోతే .. పెళ్లి ఆశలు కనిపించకపోతే అదే అసలైన టెన్షన్ అంటూ దర్శకుడు తయారు చేసుకున్న కథనే '29'. ఇది ఈ కథలో హీరోగారి ఏజ్.

ప్రేమించుకోవడానికి కులమతాలతో సంబంధం లేదు. నిజమైన ప్రేమికులు ఆర్థికపరమైన తారతమ్యాలు పట్టించుకోరు. అయితే ప్రేమికులు పుట్టి పెరిగిన వాతావరణం .. వాళ్ల కుటుంబ నేపథ్యాలు .. వాళ్ల ఆలోచనలను ప్రభావితం చేస్తాయనే అంశాన్ని దర్శకుడు టచ్ చేస్తూ వెళ్లాడు. తన ప్రేయసి తన కళ్లముందుంటే చాలని హీరో అనుకుంటాడు. తనకి మాదిరిగానే అతనికి కూడా ఒక లక్ష్యం .. గమ్యం ఉంటే బాగుంటుందని ఆమె భావించడం దగ్గరే ఈ కథ మలుపు తిరుగుతుంది. ఈ కథ చాలా సింపుల్ గా ముందుకు వెళుతూ ఉంటుంది. సున్నితమైన భావోద్వేగాలను కలిగిస్తూ సాగుతూ ఉంటుంది. రొటీన్ గా కనిపించే సన్నివేశాలే అయినా, దర్శకుడు ఫీల్ మిస్సవ్వకుండా చూసుకున్నాడు. తన తల్లి ఆశయాన్ని నెరవేర్చడం కోసం హీరోను హీరోయిన్ దూరం పెడుతుంది. తన నుంచి విజయలక్ష్మి ఏం ఆశిస్తుందనేది అర్థమైన తరువాత, అతను ఒక ఆశయాన్ని ఏర్పరచుకుంటాడు. సత్య తన తల్లి ఆశయాన్ని నెరవేర్చడం కోసం రంగంలోకి దిగుతాడు. ఆ క్రమంలో డబ్బు – అధికారం ఉన్న వ్యక్తిని ఢీ కొనడం.. జైలు పాలు కావడం .. అయితే తన లక్ష్యాన్ని మార్చుకోకపోవడం ఈ కథను మరింత బలంగా మారుస్తూ ముందుకు తీసుకుని వెళుతుంది. ఒక లక్ష్యం పెట్టుకుని దానిని సాధించడంలోని ఆనందం ఎలా ఉంటుందనేది అప్పుడు అర్థం చేసుకుంటాడు. కథలో భారీతనం .. కథనంలో ట్విస్టులు లేకపోయినా, సహజమైన సన్నివేశాలతో .. మనసుకు హత్తుకునే దృశ్యాలతో ఈ కథ ముందుకు వెళుతుంది. యూత్ లో ప్రతి ఒక్కరికీ ఇది తమ కథ అనిపిస్తుంది .. ఆకట్టుకుంటుంది. కథలోని ఈ ఫీల్ కారణంగానే లోకేశ్ కనగరాజ్ – కార్తీక్ సుబ్బరాజ్ నిర్మాతలుగా ముందుకు వచ్చారేమో అనిపిస్తుంది. అక్కడక్కడా కాస్త సాగదీసినట్టుగా అనిపించినప్పటికీ, ఫీల్ తో మేనేజ్ చేస్తూ వెళుతుంది. విధు నటన ఆకట్టుకుంటుంది. అసలు అతను కెమెరా ముందు ఉన్న విషయాన్ని మరిచిపోయాడు. ప్రీతీ అస్రాని ప్రత్యేక ఆకర్షణ అనే చెప్పాలి. కడిగిన ముత్యంలా కనిపిస్తూ, తన నటనతోను యూత్ మనసులు దోచేస్తుంది. మాదేశ్ ఫొటోగ్రఫీ .. సీన్ రోల్డన్ సంగీతం .. సతీశ్ కుమార్ ఎడిటింగ్ ఫరవాలేదు. ప్రేమ అనేది ఎంతో గొప్పది .. దానికి మించిన ప్రపంచం మరొకటి లేదు అని భావించే అబ్బాయికీ, ప్రేమ అనేది ఒక ఫాంటసీనే. జీవితమనే ప్రయాణం వాస్తవంలో చేయవలసి ఉంటుందని నమ్మిన అమ్మాయికి మధ్య జరిగే ఈ కథ యూత్ ను తప్పకుండా ఆలోచింపజేస్తుంది. ప్రేమ కొత్త ఆశలు చిగురింపజేస్తుంది. అయితే ఆశ కంటే ఆశయం గొప్పదని నిరూపించే సందేశం మనకి ఈ కథలో కనిపిస్తుంది

# రామానాయుడు స్టూడియోలో

## నా ఫొటో ఉండాలనే కోరిక నెరవేరింది: ప్రియమణి

నేషనల్ అవార్డ్ విన్నర్, సీనియర్ నటి ప్రియమణి టాలీవుడ్‌తో పాటు పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు పోషిస్తూ దేశవ్యాప్తంగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. కొంతకాలం క్రితం విక్టరీ వెంకటేష్ హీరోగా, శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వంలో వచ్చిన 'నారప్ప' చిత్రంలో ఆమె పోషించిన సుందరమ్మ పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుండి భారీ ప్రశంసలు దక్కాయి. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సురేష్ బాబు నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలై పెద్ద సక్సెస్ సాధించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ప్రియమణి మాట్లాడుతూ... ఈ సినిమాకు సంబంధించి, అలాగే తన కెరీర్‌కు సంబంధించిన ఒక కీలక విషయాన్ని పంచుకుంది. "చాలా ఏళ్ల క్రితం నేను రామానాయుడు స్టూడియోలో షూటింగ్ చేస్తున్న సమయంలో, అక్కడ ఒక గోడపై ఎంతోమంది ప్రముఖ నటీమణుల ఫొటోలు అందంగా అలంకరించి ఉండటం చూశాను. అప్పట్లో వాటి ప్రాధాన్యత నాకు పూర్తిగా తెలియదు. కానీ ఆ తర్వాత తెలిసింది.. వారంతా ప్రతిష్ఠాత్మక 'సురేష్ ప్రొడక్షన్స్' బ్యానర్‌లో నటించిన లెజెండరీ హీరోయిన్లు అని. ఆ రోజే నా మనసులో ఒక బలమైన కోరిక కలిగింది.. ఎలాగైనా భవిష్యత్తులో ఆ గోడపై నా ఫొటో కూడా స్థానం సంపాదించుకోవాలని అనుకున్నాను" అని చెప్పుకొచ్చింది. ఆమె అనుకున్నట్లుగానే కొన్ని సంవత్సరాల తర్వాత సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్ నుండి 'నారప్ప' రూపంలో ఆమెకు అద్భుతమైన అవకాశం వచ్చింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన నటించడమే కాకుండా, సురేష్ ప్రొడక్షన్స్ లాంటి పెద్ద బ్యానర్‌లో పనిచేయాలనే దశాబ్దాల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేసింది. డైరెక్టర్ శ్రీకాంత్ అడ్డాల ఒక గొప్ప విజన్ ఉన్న దర్శకుడని, నారప్ప చిత్రాన్ని ఎంతో అద్భుతంగా, భావోద్వేగభరితంగా తెరకెక్కించారని కొనియాడింది. 'నారప్ప' సినిమాలో నటించడం వల్లే ఈ రోజు రామానాయుడు స్టూడియోలో ఆ హీరోయిన్ల ఫొటోల పక్కన తన ఫొటో కూడా చేరిందని, ఆ కోరిక నెరవేరడం తనకు ఎంతో గర్వంగా, సంతోషంగా ఉందని ప్రియమణి భావోద్వేగానికి లోనైంది.



# వర్షంతో పాటు మా ఇంటికి దేవి వచ్చింది



ప్రముఖ సినీ నటి తమన్నా భాటియా తన ఇంట్లో జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమం గురించి, దాని వెనుక ఉన్న తన అనుభూతిని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ముంబైలోని తన నివాసంలో లింగ భైరవి దేవి పుణ్య పూజను నిర్వహించగా, ఆ రోజు జరిగిన ఓ సంఘటనను దైవ సంకేతంగా ఆమె అభివర్ణించారు. వివరాల్లోకి వెళితే, పూజకు ముందు ముంబైలో భరించలేని వేడి వాతావరణం ఉందని, పూజకు వచ్చిన అతిథులు ఇబ్బంది పడతారేమోనని తాను ఆందోళన చెందానని తమన్నా తన పోస్టులో తెలిపారు. అయితే, పూజ జరిగే రోజు ఉదయం నిద్రలేచి చూడగా, అనూహ్యంగా వర్షం కురిసిందని, వాతావరణం ఒక్కసారిగా చల్లబడిందని ఆమె ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "చెట్లు గాలికి ఊగుతున్నాయి, పువ్వులు వర్షంలో తడిసి ముద్దయ్యాయి. కొన్ని రోజులుగా నగరాన్ని కమ్మేసిన వేడి మాయమైంది. పూజ గంటల తర్వాత మొదలైనా, వర్షంతో పాటే దేవి మా ఇంటికి వచ్చిందనిపించింది" అని తమన్నా రాసుకొచ్చారు. పూజ పూర్తయి, అందరూ వెళ్లిపోయిన తర్వాత కూడా ఆ ఇంట్లో ఏదో దైవిక శక్తి నిలిచిపోయినట్లు తనకు అనిపించిందని ఆమె పేర్కొన్నారు. "జపం ముగిసింది, పూజ పూర్తయింది. అయినా నేను దేవి పక్కనే కూర్చుండిపోయాను. ప్రార్థన, వేడుక, నవ్వులు, భక్తితో నిండిన ఆ ఇంటిలో ఇంకా ఏదో అందమైన అనుభూతి గాలిలో నిలిచిపోయినట్టు అనిపించింది" అని తమన్నా తన భావాలను వివరించారు. ఈ ప్రత్యేకమైన రోజును కుటుంబ సభ్యులు, ఆత్మీయులతో కలిసి జరుపుకోవడం మరింత ఆనందాన్నిచ్చిందని ఆమె తెలిపారు.

# 100 కథలు రిజెక్ట్..

## ఎట్టకేలకు కొత్త సినిమాను లైన్‌లో పెట్టిన వైష్ణవ్ తేజ్!



'ఉప్పెన' సినిమాతో టాలీవుడ్‌లోకి బ్లాక్‌బస్టర్ ఎంట్రీ ఇచ్చిన మెగా హీరో పంజా వైష్ణవ్ తేజ్, గత కొంతకాలంగా ఆశించిన స్థాయిలో విజయాలు లేకపోవడంతో తన తదుపరి ప్రాజెక్ట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సాలిడ్ హిట్‌తో మళ్లీ ట్రాక్‌లోకి ఎక్కాలనే పట్టుదలతో ఉన్న ఈ యంగ్ హీరో, కథల ఎంపిక కోసం గత మూడు సంవత్సరాలలో ఏకంగా 100కు పైగా స్క్రిప్ట్‌లను తిరస్కరించినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో గట్టి టాక్ నడుస్తోంది. ముఖ్యంగా ఆదికేశవ ఇచ్చిన దెబ్బ వైష్ణవ్ మీదా చాలా పడింది. అయితే ఎట్టకేలకు ఈ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ వైష్ణవ్ తేజ్ తన తదుపరి సినిమాను అధికారికంగా ఖరారు చేశారు. యువ దర్శకుడు మహేష్ ఎస్ చెప్పిన ఒక కథ ఈ యంగ్ హీరోను ఎంతగానో ఆకట్టుకోవడంతో ఆయన వెంటనే ఈ ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తుంది. గతంలో సుధీర్ బాబు హీరోగా వచ్చిన 'హంట్' చిత్రానికి మహేష్ ఎస్ దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. టాలీవుడ్‌లో వరుస క్రేజీ చిత్రాలను నిర్మిస్తున్న ప్రముఖ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే నెలలో ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనతో పాటు మిగిలిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను చిత్ర యూనిట్ వెల్లడించనుంది. ఆ వెంటనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఎంతో ఆలోచించి వైష్ణవ్ తేజ్ ఓకే చేసిన ప్రాజెక్ట్ కావడంతో మెగా అభిమానుల్లో ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు నెలకొన్నాయి.

# పర్యావరణ పరిరక్షణకు మోదీ ప్రభుత్వం ప్రాధాన్యత: జల్లి శైలజ హరినాథ్

- మేడ్చల్‌లో ఘనంగా "అమ్మ పేరిట ఒక్క మొక్క కార్యక్రమం
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో మొక్కల నాటకం



**మేడ్చల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సుపరిపాలనకు గుర్తుగా మేడ్చల్ పురపాలక బీజేపీ ఆధ్వర్యంలో "అమ్మ పేరిట ఒక్క మొక్క" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మేడ్చల్ పురపాలక బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పురపాలక బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజహరినాథ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం గత 12 సంవత్సరాలుగా అభివృద్ధి, సంక్షేమం, మౌలిక వసతులు, జాతీయ భద్రత, మహిళా సాధికారత వంటి అన్ని రంగాల్లో విశేష పురోగతి సాధించిందని కొనియాడారు. దేశ అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. "అమ్మ పేరిట ఒక్క మొక్క" పిలుపుతో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, ప్రకృతిని సంరక్షించాల్సిన బాధ్యతను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు గౌరారం జగన్ గౌడ్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ కోశాధికారి లవంగ శ్రీకాంత్, మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీ గుప్త, బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు రాగం అర్జున్, మరియు యువమోర్చా జిల్లా నాయకులు బొజ్జ రాఘవ రెడ్డి, మేడ్చల్ పురపాలక బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, జకట ప్రేమ్ దాసు, ఎల్లంపేట పురపాలక బీజేపీ ప్రధాన కార్యదర్శి మహేష్, కిసాన్ మోర్చా నాయకులు చీర్ల సత్యనారాయణ, పురపాలక బీజేపీ ఉపాధ్యక్షులు సర్వేశ్వర రెడ్డి, మహిళా మోర్చా నాయకులు మల్లాది హేమలత రెడ్డి, తోట అనిత, పురపాలక బీజేపీ కార్యదర్శి డీ.సాయి, మరియు విష్ణు పాల్గొన్నారు.

# "ఒక్కో వ్యక్తి ఒక్కో మొక్క నాటి సంరక్షిస్తేనే పర్యావరణ సమతుల్యత సాధ్యం"

- సీఐ రవి కుమార్



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ సీఐ రవి కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అడవుల నరికివేత కారణంగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవాలని సూచించారు. "మొక్కలు నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా మనందరి బాధ్యత" అని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నవీన్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించిన ఎమ్మెల్యే సత్యం

- కొలుపుల ప్రవీణ్, కల్లెపల్లి చంద్రయ్య
- ప్రవీణ్, చంద్రయ్య ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల యువ నాయకులు కొలుపుల ప్రవీణ్, గ్రామ ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య ఆధ్వర్యంలో చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం గ్రామంలోని వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ చొప్పదండి నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం ప్రజల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు ప్రోత్సాహం కల్పించడంలో ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ఎమ్మెల్యే సత్యం జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని, ఆయన ఆయురారోగ్యాలతో మరెన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# ఉప్పుగూడ కాళీమాత ఆలయ భూములను పరిరక్షించండి

## - నామ్ రామ్ రెడ్డి. రాష్ట్రీయ వానరసేన జాతీయ అధ్యక్షులు

- ఆలయ భూముల పరిరక్షణలో అలసత్వం. - కబ్జా కోరల్లో కాళీమాత ఆలయ భూములు
- ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు - స్థానిక నాయకుల కబంధ హస్తంలో ఆలయ భూమి
- పార్కింగ్ పేరుతో ప్రహరీగోడ నిర్మాణం. - ఆలయ ఆదాయానికి గండి కొడుతున్న దళారీలు
- పిర్యాదు చేసిన అధికారులు అధికారుల్లో స్పందన కరువు
- యదేచ్ఛగా ప్రహరీగోడ నిర్మాణం - ఆలయ భూమిని ఆదాయ వనరుగా సద్వినియోగం చేసుకోవాలి
- అక్రమ నిర్మాణాలు, అక్రమ పార్కింగ్ లపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలి

రాష్ట్రీయ వానరసేన ®

"ఆలయ భూముల కాపలాదారులు"

**సంతోష్‌నగర్ (ప్రశ్న న్యూస్)** ఉప్పుగూడ ప్రాంతంలో ఉన్న కాళీమాత ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలు, అక్రమ పార్కింగ్ దందాపై విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ వానరసేన జాతీయ అధ్యక్షుడు నామ్. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు దేవాదాయశాఖ కమిషనర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఆలయ భూముల కబ్జాలపై ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. గతంలో పాతబస్తీ ఉప్పుగూడ ప్రాంతంలోని శ్రీ కాళీమాత ఆలయ భూమి కబ్జాలను రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో పోరాటం చేసి ఆక్రమణల నుండి కాపాడి తిరిగి దేవాలయానికి అప్పగించిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కొంతమంది స్థానిక నాయకులు ఆలయ భూమిని ఆక్రమించుకుని అక్రమంగా పార్కింగ్ దందా చేస్తు జీహెచ్ఎంసీ కి చెందిన దాదాపు 300 వాహనాలను పార్కింగ్ చేయిస్తు లక్షలాది రూపాయల ఆలయ ఆదాయాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ఎటువంటి అనుమతులు లేకుండానే పార్కింగ్ పేరుతో ప్రహరి గోడ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి ఎలాంటి స్పందన లేదని, యధావిధిగా పనులు కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోందని అన్నారు. ఆలయ ఆస్తులను పరిరక్షించాల్సిన ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. ఆలయ భూమి ద్వారా ఆదాయం పొందే అవకాశాన్ని దేవాదాయ శాఖ సద్వినియోగం చేసుకుని చట్టబద్ధంగా టెండర్లు నిర్వహించి పనులు చేపట్టాలని, వచ్చే ఆదాయం పూర్తిగా దేవాలయ అభివృద్ధికి వినియోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. అలాగే దేవాలయ భూమిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి వాటికి బాధ్యులైన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొని, ఆలయ భూమిని పరిరక్షించాలని రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తోంది.

# కొయ్యకాల్లు కాల్చొద్దు

## - నేల సారాన్ని కాపాడండి

- మండల వ్యవసాయ అధికారి : ప్రణీత
- జీలుగ పంట క్షేత్రస్థాయి పరిశీలన



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** వానాకాలం సాగుకు ముందు రైతులు జీలుగ, పెసర వంటి పచ్చిరొట్ట పంటలను సాగు చేసి నేల సారాన్ని పెంపొందించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రణీత సూచించారు. జీలుగ పంటను పూత దశలో కలియదున్నితే ఎకరానికి 6 నుంచి 8 టన్నుల వరకు పచ్చిరొట్ట ఎరువు లభిస్తుందని, దీంతో రెండు బస్తాల యూరియాను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. మండలంలోని అగ్రోస్ బోయినిపల్లి, పీఏసీఎస్ కోరేం, కేడీసీఎంఎస్ వెంకట్రావుపల్లి కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మర్లపేట గ్రామంలో రైతు జువ్వెంతుల రాంగోపాల్ రెడ్డి సాగు చేసిన జీలుగ పంటను సర్పంచ్ భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, రైతు శ్రీనివాస్ రెడ్డితో కలిసి పరిశీలించారు. అలాగే వరి కొయ్యకాళ్లను కాల్చకుండా రోటవేటర్‌తో దున్నాలని రైతులకు సూచించారు. కొయ్యకాల్లను కాల్చడం వల్ల నేల సారం తగ్గిపోవడంతో పాటు భూమిలోని సూక్ష్మజీవులు నశిస్తాయని, అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరించారు.

# శ్రీ శారద స్మార్త వేద విద్యాలయ ప్రవేశ పరీక్షలు

- వైభవంగా శ్రవణా నక్షత్ర మహోత్సవం



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్ )** ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యా సరస్వతి క్షేత్రానికి అనుబంధంగా నిర్వహిస్తున్న శ్రీ శారద స్మార్త వేద విద్యాలయ ప్రవేశానికి శుక్రవారం పరీక్షలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద గురువులు ఆచార్య అభిరాం శర్మ, వేద విద్యాలయ అధ్యక్షులు గుండేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు నిర్వహించి చక్కటి ప్రతిభ కనబరిచిన 22 మంది విద్యార్థులను ఎంపిక చేసి వేద విద్య అభ్యసనానికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు దాచేపల్లి వెంకట కృష్ణారావు, వేద పాఠశాల కార్యదర్శి రేణికుంట శ్రీనివాస్ గుప్త తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రవణ నక్షత్ర మహోత్సవం సందర్భంగా వేద పండితుల మంత్రోశ్చరణలు, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరగగా, విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు. సాంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా వేద విద్యా బోధన వేద విద్యతో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం వేదాల సారాన్ని సమాజానికి పంచడమే లక్ష్యం చైర్మన్ శ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి ప్రాచీన సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించడమే లక్ష్యంగా వర్గల్ క్షేత్రానికి అనుబంధంగా శ్రీ శారదా స్మార్త వేద విద్యాలయాన్ని నెలకొల్పి రెండున్నర దశాబ్దాలుగా సమాజానికి వేద విద్యను పంచుతున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి పేర్కొన్నారు. ఆధునిక విద్యా విధానంతో వేద విద్య పరిజ్ఞానాన్ని జోడించి పరిపూర్ణమైన విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా వర్గల్ వేద విద్యాలయంలో విద్యనభ్యసించిన పలువురు ఉన్నత స్థాయిలో ఉన్నట్లు వివరించారు.

# సమాజ సేవలో ముందుండాలి

- నీలోజిపల్లి సర్పంచ్ : అనుముల భాస్కర్
- ఘనంగా వార్డు సభ్యులు ఉమ్మారెడ్డి శైలజ - అనిల్ రెడ్డి పెళ్లిరోజు వేడుకలు



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామ వార్డు సభ్యులు ఉమ్మారెడ్డి శైలజ -- అనిల్ రెడ్డి దంపతుల పెళ్లిరోజు వేడుకలను గ్రామ సర్పంచ్ అనుముల భాస్కర్, పాలకవర్గ సభ్యులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాస్కర్ దంపతులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ, శైలజ--అనిల్ రెడ్డి దంపతులు ఇలాగే ఆనందంగా, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ బంధాలు, పరస్పర అవగాహన, ప్రేమాభిమానాలే దాంపత్య జీవితా నికి బలమని పేర్కొన్నారు. సమాజ సేవలో ముందుండే ఈ దంపతులు మరింత అభివృద్ధి సాధించి అందరికీ ఆదర్శంగా నిలవాలని కోరుతూ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ఆర్మీకి ఎంపికైన యువకులను అభినందించిన తోగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలానికి చెందిన యువకులు ఆర్మీలో ఎంపిక కావడం పట్ల తోగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ అభినందనలు తెలిపారు. దౌల్తాబాద్ మండలానికి చెందిన బ్యాగరి రవీందర్, పొగాకు ప్రసాద్, బాషమైన అఖిల్ దొమ్మాట, బండారి గౌతమ్ (తిరుమలాపూర్) ఆర్మీకి ఎంపిక కావడంతో వారిని పోలీస్ స్టేషన్‌కు ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా దేశ సేవకు ఆర్మీలో చేరడం ఎంతో గౌరవప్రదమైన విషయమని పేర్కొంటూ, విధి నిర్వహణలో పాటించాల్సిన క్రమశిక్షణ, నిబద్ధత, దేశభక్తి విలువల గురించి వారికి అవగాహన కల్పించారు. అనంతరం యువకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశ రక్షణలో తమ వంతు సేవలందించి మండలానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.


# భూవివాద కారణంగా జరిగిన దాడి ఘటనలో ఒకరిని రిమాండ్




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలో భూ వివాదం కారణంగా జరిగిన దాడి ఘటనలో ఒకరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రాయపోలు ఎస్సై మానస తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన కుశాంబి స్వామి, తుప్పటి కొండయ్య మధ్య భూ తగాదాల (భూ వివాదం) విషయంలో గత కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో జూన్ 3, 2026న ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ఆగ్రహానికి గురైన కుశాంబి స్వామి ఇనుప రాడ్డుతో కొండయ్యపై దాడి చేశాడు. ఈ దాడిలో కొండయ్యకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డ్యూటీ వైద్యులు అందించిన మెడికల్ సర్టిఫికెట్ ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు కుశాంబి స్వామిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మానస తెలిపారు.

# సీజ్ చేసినా ఆగని అక్రమ నిర్మాణాలు

**- మల్కాజిగిరి సర్కిల్‌లో యథేచ్ఛగా నిర్మాణాలు - ఫిర్యాదులు చేసినా పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు**









మల్కాజిగిరి(ప్రశ్న న్యూస్,) మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాల దందా రోజురోజుకూ మరింత విస్తరిస్తుండగా, వాటిని అడ్డుకోవాల్సిన మున్సిపల్ శాఖ పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లో అనుమతులకు విరుద్ధంగా రెండు అంతస్తులకు అనుమతులు తీసుకొని బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం బహిరంగంగానే కొనసాగుతున్నా, డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. స్థానికుల ఆరోపణల ప్రకారం, టౌన్ ప్లానింగ్ విభాగంలోని సెక్షన్ అధికారులు, ఏసీపీ అక్రమ నిర్మాణాలను నియంత్రించాల్సిన బాధ్యతను విస్మరించి, వాటికి పరోక్షంగా ప్రోత్సాహం అందిస్తున్నారని అంటున్నారు. నోటీసులు జారీ చేయడం, ఒకటి రెండు సార్లు తనిఖీలు నిర్వహించడం, కొంత సామగ్రిని స్వాధీనం చేసుకోవడం వంటి చర్యలతో హడావుడి సృష్టించినా, అనంతరం అదే భవనాల్లో నిర్మాణ పనులు యథావిధిగా కొనసాగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. జోనల్ కార్యాలయ స్థాయిలో పలు మార్పులు జరిగినప్పటికీ, అక్రమ నిర్మాణాల విషయంలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా అదనపు అక్రమ అంతస్తులు నిర్మిస్తున్న భవనాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన సెక్షన్ ఆఫీసర్, ఏసిపి అధికారులు, కేవలం ఫిర్యాదుదారుల ను నిలుపుదల వరకే పరిమితమవుతున్నారని విమర్శిస్తున్నారు. ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం వల్ల ప్రజల్లో మున్సిపల్ శాఖ పై పూర్తిగా శ్రీ నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ అక్రమ నిర్మాణాల కారణంగా అత్యధికంగా నష్టపోతున్నది పేద, మధ్యతరగతి వర్గాలేనని ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవితకాల పొదుపులు, బ్యాంకు రుణాలతో ఇళ్లు కొనుగోలు చేసిన తర్వాతే ఆ భవనం అక్రమ నిర్మాణమని తెలుసుకుని అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. నిర్మాణం ప్రారంభ దశలోనే అడ్డుకోవాల్సిన మల్కాజిగిరి సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి నిర్లక్ష్యం ప్రదర్శించడం వల్ల చివరకు అమాయక కొనుగోలుదారులే మూల్యం చెల్లించాల్సి న పరిస్థితి ఏర్పడుతోంది. ఇటీవల అధికారులు నిర్మాణ సామగ్రిని స్వాధీనం చేసుకున్నప్పటికీ, అదే భవనాలపై మరో మూడు అంతస్తుల వరకు అక్రమంగా నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లంచాలు తీసుకుని మౌనంగా ఉంటున్న అధికారులపై ఒత్తిడి పెరిగినప్పుడు మాత్రమే తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడటమే కాకుండా, రహదారుల ఆక్రమణ, పార్కింగ్ సమస్యలు, ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తీవ్రంగా పెరుగుతున్నాయి. ఇప్పటికైనా మల్కాజిగిరి జోనల్ కమిషనర్, మల్కాజ్గిరి సర్కిల్ డిప్యూటీ కమిషనర్, ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి మల్కాజిగిరి సర్కిల్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# మల్లాపూర్‌లో అక్రమ నిర్మాణం.. చర్యలు ఎక్కడ.?

**- జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదంటున్న స్థానికులు - సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణం.. ప్రజలకు తీవ్ర ఇబ్బందులు**









**నాచారం(ప్రశ్న న్యూస్)** నాచారం సర్కిల్ పరిధిలోని టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఓల్డ్ మల్లాపూర్ ప్రాంతంలో అక్రమ నిర్మాణాల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఓల్డ్ మల్లాపూర్‌లో గాంధీ విగ్రహం సమీపంలోని ఇంటి నెంబర్ 1-159 వద్ద జరుగుతున్న నిర్మాణంపై స్థానికులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణం చేపట్టడంతో పాటు రోడ్డు వైపు రైలింగ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై పలుమార్లు సంబంధిత అధికారులకు, సర్కిల్ కార్యాలయానికి, జోనల్ కమిషనర్ కార్యాలయానికి ఫిర్యాదులు చేసినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణం కొనసాగుతున్నప్పటికీ అధికారులు కేవలం పరిశీలనలకే పరిమితమవుతున్నారని, నోటీసులు ఇచ్చినా అమలు చేయించడంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన అధికారులే లంచాలు తీసుకొని పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులను పట్టించుకోకుండా మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నదని స్థానికులు పేర్కొంటున్నారు. నాచారం సర్కిల్ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు భారీగా పెరుగుతున్నప్పటికీ వాటిపై కనీస చర్యలు కనిపించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడంలో జోనల్ కమిషనర్ రాధికా గుప్తా పూర్తిగా విఫలమైందని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఈ నిర్మాణంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అందరికీ సమానంగా అమలవ్వాలే తప్ప కొందరికి మినహాయింపులు ఇవ్వకూడదని స్థానికులు జోనల్ కమిషనర్ కు స్పష్టం చేస్తున్నారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఉన్నత అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

# మా పాలనలో పేపర్ లీక్ కాలేదు

**- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు కేజ్రీవాల్ డిమాండ్**





న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) తమ పదేళ్ల ఢిల్లీ పాలనలోగానీ, నాలుగేళ్ల పంజాబ్ పాలనలోగానీ ఇప్పటివరకు ఒక్క ప్రశ్నపత్రం కూడా లీక్ కాలేదని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పరీక్షా పత్రాల లీకేజీలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పేపర్ లీకేజీలు సర్వసాధారణంగా మారాయని ఆయన ఆరోపించారు. దీని వెనుక ఉన్నత స్థాయి వ్యక్తులతో కూడిన ఒక పెద్ద మాఫియా ఉందని, ఇది వేల కోట్ల రూపాయల వ్యాపారంగా రూపాంతరం చెందిందని విమర్శించారు. రాజకీయ అండదండలు లేకుండా ఇటువంటి లీకేజీలు జరగడం అసాధ్యమని పేర్కొన్నారు. గతంలో ఢిల్లీలో తమ ప్రభుత్వం పటిష్ఠమైన పాలనా యంత్రాంగంతో పరీక్షల సమగ్రతను కాపాడిందని, ఇప్పుడు పంజాబ్ లో ఉన్న తమ ప్రభుత్వం కూడా అదే పంథాలో నడుస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా, గతంలో తెలంగాణలో నిషేధానికి గురైన ఒక సంస్థకు సీబీఎస్ఈ 12వ తరగతి ఆన్‌స్క్రీన్ మార్కింగ్ కాంట్రాక్టును అప్పగించడాన్ని ఆయన తప్పుపట్టారు. సదరు కంపెనీ చేసిన తప్పిదాల కారణంగానే గతంలో 20 మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. అపఖ్యాతి పాలైన అటువంటి సంస్థపై చర్యలు తీసుకోకపోవడాన్ని ప్రశ్నిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. నీట్-యూజీ 2026 పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో పరీక్ష రద్దు కావడంపై కేజ్రీవాల్ స్పందించారు. ఈ లీకేజీల సమస్యకు వ్యతిరేకంగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజల నుంచి తగినంత ఒత్తిడి రాకపోతే ఈ సమస్య ఇలాగే కొనసాగుతుందని, తద్వారా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన హెచ్చరించారు.

# యుద్ధానికి ముగింపు పలుకుదాం

**- పుతిన్‌కు జెలెన్‌స్కీ బహిరంగ లేఖ**





కీవ్ (ప్రశ్న న్యూస్) ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలికే దిశగా అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో నేరుగా చర్చలు జరిపేందుకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఈ మేరకు ఆయన పుతిన్‌కు రాసిన ఒక బహిరంగ లేఖను పుతిన్ స్వీకరించి, పూర్తిగా చదివినట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం (క్రెమ్లిన్) అధికారికంగా వెల్లడించింది. రష్యా అగ్రశ్రేణి వార్తా సంస్థ 'టాస్' కథనం ప్రకారం, సెయింట్ పీటర్స్‌బర్గ్ అంతర్జాతీయ ఆర్థిక ఫోరమ్ సదస్సు సందర్భంగా పుతిన్ ప్రెస్ సెక్రటరీ డిమిత్రి పెస్కోవ్ ఈ విషయాన్ని ధృవీకరించారు. "మన మధ్య ప్రత్యక్ష చర్చల ద్వారా ఈ యుద్ధానికి ముగింపు పలుకుదాం. ఇందుకోసం నేను ఒక సమావేశాన్ని ప్రతిపాదిస్తున్నాను" అని జెలెన్‌స్కీ తన లేఖలో పేర్కొన్నారు. "యూరప్ దృష్టి మళ్లీ ఈ యుద్ధంపై పడే వరకు వేచి చూడటం సరికాదు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ శాంతి చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు స్విట్జర్లాండ్, టర్కీ, అరబ్ దేశాలు ముందుకు రావాలని ఆయన సూచించారు. చర్చలకు స్పష్టమైన తేదీని నిర్ణయించుకోవాలని కూడా ప్రతిపాదించారు. చర్చలు జరిగేంత కాలం పూర్తిస్థాయి కాల్పుల విరమణకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీ తన లేఖలో హామీ ఇచ్చారు. "ఇది ప్రామాణికమైన పద్ధతి. ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి నిజమైన నిశ్శబ్దాన్ని నెలకొల్పడమే ఉత్తమ మార్గం. ఇది కేవలం ప్రయత్నం కాదు, మీకు నిజంగా ఆసక్తి ఉంటే ఇది నిజమైన కాల్పుల విరమణ అవుతుంది" అని ఆయన వివరించారు. ఈ లేఖపై ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన స్పందనల గురించి కూడా పుతిన్‌కు తెలియజేశామని పెస్కోవ్ తెలిపారు. ఈ పరిణామంపై పెస్కోవ్ స్పందిస్తూ, చర్చలను పునఃప్రారంభించాలని రష్యా కోరుకుంటోందని అన్నారు. "ప్రస్తుతం నెలకొన్న స్తబ్ధత త్వరలోనే ముగుస్తుందని, చర్చలు మళ్లీ మొదలవుతాయని ఆశిస్తున్నాం. ఇప్పటికే అమెరికాతో పలు మార్గాల్లో సంప్రదింపులు జరుపుతున్నాం" అని ఆయన తెలిపారు. "పుతిన్ చర్చలకు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటారు. రష్యాతో మాట్లాడకూడదనే తమ వైఖరిని యూరప్ దేశాలు విడిచిపెడితే, వారు కేవలం ఫోన్ చేసి మాట్లాడితే సరిపోతుంది" అని పెస్కోవ్ వ్యాఖ్యానించారు. అయితే, ఉక్రెయిన్‌తో వివాదం చాలా సంక్లిష్టమైనదని, అది అంత సులభంగా పరిష్కారమయ్యేది కాదని కూడా ఆయన అభిప్రాయపడినట్లు టాస్ నివేదించింది.

# ప్లాస్టిక్ కరెన్సీ చలామణిలోకి రాబోతోందంటూ ప్రచారం

**ప్రతిపాదనను పరిశీలిస్తున్నమన్న ఆర్బీఐ గవర్నర్**




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారతదేశంలో త్వరలోనే పాలిమర్ (ప్లాస్టిక్) కరెన్సీ నోట్లు చలామణిలోకి రాబోతున్నాయంటూ జరుగుతున్న ప్రచారంపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టతనిచ్చారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్న మాట వాస్తవమేనని, అయితే ఇది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలో పేపర్ కరెన్సీ వాడకం విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, ప్లాస్టిక్ నోట్లను తీసుకురావడానికి గల సాధ్యాసాధ్యాలపై ఆర్‌బీఐ కసరత్తు చేస్తోంది. కాగితపు నోట్ల ముద్రణకు భారీగా ఖర్చు అవ్వడం, అవి త్వరగా పాడైపోయి చలామణి నుంచి తొలగించాల్సి రావడం వంటి కారణాల వల్లే ఈ ప్రత్యామ్నాయంపై ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్లాస్టిక్ నోట్ల వల్ల కలిగే ప్రయోజనాలు, వాటి వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, ఆపరేషనల్ సమస్యలపై ఆర్బీఐ నిపుణులు అధ్యయనం చేస్తున్నారు. నిజానికి, ప్లాస్టిక్ నోట్ల ప్రస్తావన ఈనాటిది కాదు. 2014 ఫిబ్రవరిలోనే కేంద్ర ప్రభుత్వం దీనిపై పార్లమెంటుకు సమాచారం అందించింది. భౌగోళిక, వాతావరణ వైవిధ్యాలను పరీక్షించడానికి దేశవ్యాప్తంగా ఐదు నగరాలను (కొచ్చి, మైసూర్, జైపూర్, సిమ్లా, భువనేశ్వర్) ఎంపిక చేశారు. ఆయా ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా రూ. 100 కోట్ల విలువైన ప్లాస్టిక్ నోట్లను ప్రవేశపెట్టాలని భావించారు. కానీ, అప్పట్లో కొన్ని సాంకేతిక, నిర్వహణ లోపాల వల్ల ఈ ప్రాజెక్టు తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇప్పుడు ఆర్‌బీఐ మళ్లీ ఈ ఫైల్‌ను కదిలించడంతో త్వరలోనే దేశంలో ప్లాస్టిక్ నోట్లు అందుబాటులోకి వస్తాయనే ఊహాగానాలు ఊపందుకున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588